# లోకల్ గైడ్
LGTV
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ తెలంగాణ
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జిలు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094



ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,218 | పేజీలు -12 | శనివారం -06 - జూన్ - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,


## స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తా.. మంత్రి రాజీనామాపై డీకే శివకుమార్

- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో లుకలుకలు
- అడిగిన శాఖ ఇవ్వలేదని మంత్రుల అసంతృప్తి
- మంత్రి పదవికి రాజీనామా చేసిన రామలింగారెడ్డి
- రామలింగారెడ్డి తనకు ఆప్త మిత్రుడన్న సీఎం

కర్ణాటక: మంత్రి రామలింగారెడ్డి రాజీనామాతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో రేగిన కలకలంపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు.



రామలింగారెడ్డి తమకు సీనియర్ నేత మాత్రమే కాదని, తనకు అత్యంత ఆప్తమిత్రుడని సీఎం పేర్కొన్నారు. శాఖల కేటాయింపుపై ఆయనకున్న అసంతృప్తి మిగతా 2 లో

## పాలమూరు-రంగారెడ్డి పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం

### బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు

- అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు
- నాపై కోపంతో ఆ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు
- బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు
- "ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి



కరివెన: బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో మిగతా 2 లో



### కబ్జాల నివారణకు హైడ్రా ప్రత్యేక డ్రైవ్

- 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!
- పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె
- రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి హైడ్రా రక్షణ
- చారిత్రక రాతి నిర్మాణాలను కాపాడేందుకు చర్యలు
- ఎన్జీవో ఫిర్యాదు, కోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



### పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి.. సాగు, తాగునీరు అందిస్తాం

- నార్లాపూర్ ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 కాలువల నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలన
- ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పనుల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, వేగవంతంగా పూర్తి చేయాలి మిగతా 2 లో

## ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి

### 2.5 కోట్ల 'విత్తన బంతుల' భారీ ఉద్యమం!

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేళ పవన్ కల్యాణ్ పిలుపు
- మూలపాడులోని బటర్ ఫ్లై పార్కులో తెల్ల పానికి మొక్కను నాటిన పవన్
- తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ మొక్క నాటిన వైనం
- 2.5 కోట్ల సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం



అమరావతి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక వినూత్నమైన, మిగతా 2 లో

### ట్రంప్ 'శాంతిదూత' అయ్యాడట.. పాక్ ప్రధాని భజన!

ట్రంప్ జోక్యం వల్లే భారత్‌తో కాల్పుల విరమణ కుదిరిందన్న పాక్ ప్రధాని



- అమెరికా అధ్యక్షుణ్ని శాంతిదూతగా అభివర్ణించిన షరీఫ్
- మూడో దేశం జోక్యం లేదని గతంలోనే కొట్టిపారేసిన భారత్
- నిధుల కోసం పాక్ డ్రామాలంటున్న నిపుణులు

## పోలవరం ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

### భద్రాచలం పట్టణానికి నిత్యం జలగండమే

హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలం పట్టణానికి నిత్యం జలగండమేనని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. ముంపు గ్రామాలకే కాకుండా పరిశ్రమలకు సైతం బ్యాక్ వాటర్ ముప్పు పొంచి ఉందని తెలిపారు. భద్రాచలం వద్ద తక్షణమే కరకట్టల నిర్మాణం, అక్కడే పీపీఏ ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈఓకు ఆయన లేఖ రాశారు. 'పోలవరం ప్రాజెక్టు పూర్తయితే.. బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలంలో ఎప్పుడూ 13.15 నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిలిచి ఉంటుంది. భవిష్యత్తులో ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 36 నుంచి 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తే.. తెలంగాణకు ఊహించని ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. దాదాపు 5వేల కుటుంబాలకు ఉపాధి



కల్పిస్తున్న ఐటీసీ పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్ ప్రాజెక్టులకు ప్రమాదం పొంచి ఉంది. ముంపు వల్ల పదేపదే నష్టపోతున్న సుమారు 2,000 కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారంతోపాటు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలి' అని హరీశ్‌రావు తన లేఖలో కోరారు.

### సంచలన వ్యాఖ్యలతో హెడ్‌లైన్స్‌లో రాహుల్.. సరికొత్త రాజకీయ వ్యూహంపై చర్చ



- డొనాల్డ్ ట్రంప్ శైలితో రాజకీయ పోలిక
- ప్రధాని మోదీపై విదేశీ ప్రభావ ఆరోపణలు
- వ్యూహాత్మక ప్రచారంగా కాంగ్రెస్ సమర్థన
- ప్రతిపక్ష నేత విశ్వసనీయతపై బీజేపీ ప్రశ్నలు

### ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా క్లారిటీ!

ప్లాస్టిక్ కరెన్సీ చలామణిలోకి రాబోతోందంటూ ప్రచారం




- ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట నిజమేనన్న ఆర్బీఐ గవర్నర్
- 2014లో పార్లమెంటులో ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావనత

## ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి

### బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతాం

- అమరావతి నుంచి నెల్లూరు వరకు ఆక్వా కారిడార్ అభివృద్ధికి ప్రణాళిక
- భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో ఏపీ వాటా 38 శాతం అని వెల్లడి
- ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ
- 'ఆంధ్రా ప్రింప్.. ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్ స్థాపించాలని పిలుపు



అమరావతి: భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదేనని, భారతదేశ బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మిగతా 2 లో



### జనసేన రాజ్యసభ అభ్యర్థిని ఖరారు చేసిన పవన్ కల్యాణ్?

- ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు
- టీడీపీ 3 స్థానాలు, జనసేన ఒక స్థానంలో పోటీ
- చాలా కాలంగా లింగమనేని పేరును పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

అమరావతి: ఏపీలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్డీయే కూటమి సీట్ల పంపకాలు పూర్తయ్యాయి. టీడీపీ 3, జనసేన ఒక స్థానంలో




### వైఎస్ షర్మిలకు నిరాశ.. దక్కని రాజ్యసభ టికెట్

- షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయబోతున్నారంటూ కొన్ని రోజులుగా ప్రచారం
- కర్ణాటక నుంచి మూడు స్థానాలను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం
- షర్మిలకు టికెట్ దక్కకపోవడంతో అభిమానుల నిరాశ

### ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై ఆర్‌బీఐ గవర్నర్

# సంజయ్ మల్హోత్రా క్లారిటీ!

ఢిల్లీ: భారతదేశంలో త్వరలోనే పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఇది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలో పేపర్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వడం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాల వల్లే ఈ ప్రత్యామ్నాయంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక, ఆపరేషనల్ సమస్యలపై ఆర్బీఐ నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన ఈనాటిది కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. భౌగోళిక, వాతావరణ వైవిధ్యాలను పరీక్షించడానికి దేశవ్యాప్తంగా ఐదు నగరాలను (కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా రూ. 100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని భావించారు. కానీ, అప్పట్లో కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్‌బీఐ మళ్లీ ఈ ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## వైఎస్ షర్మిలకు నిరాశ.. దక్కని రాజ్యసభ టికెట్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా జోరుగా సాగిన ఊహాగానాలకు తెరపడింది. కాంగ్రెస్ అధిష్ఠానం తాజాగా ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాలో షర్మిలకు చోటు దక్కలేదు. కర్ణాటక నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలను భర్తీ చేసే క్రమంలో.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది.

కర్ణాటక కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు వీరే:

మల్లికార్జున్ ఖర్గే: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు

పవన్ ఖేడా: ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి.

మన్సూర్ అలీ ఖాన్: కేంద్ర మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ కుమారుడు.

మల్లికార్జున్ ఖర్గే ఈరోజు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య సహా పలువురు కీలక నేతలు హాజరుకానున్నారు. మరోవైపు, రాజ్యసభ ద్వారా పార్లమెంట్‌లో అడుగుపెట్టాలనుకున్న షర్మిలకు ఈసారి టికెట్ దక్కకపోవడంతో ఆమె అనుచరులు, కాంగ్రెస్ అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

## కబ్జాల నివారణకు హైడ్రా ప్రత్యేక డ్రైవ్

హైదరాబాద్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ–ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది. ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ట్రంప్ 'శాంతిదూత' అయ్యాడట.. పాక్ ప్రధాని భజన!

ఢిల్లీ: భారత సైన్యం చేతిలో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు. గతేడాది మే 10న భారత్‌తో జరిగిన కాల్పుల విరమణకు ట్రంప్ 'సమయానుకూల, నిర్ణయాత్మక జోక్యమే' కారణమని, ఆయన్ను తాము ఎప్పటికీ 'శాంతిదూత'గా గుర్తుపెట్టుకుంటామని షరీఫ్ వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లోని యూఎస్ ఎంబసీ వేడుకల్లో ఆయన ఈ భజన చేశారు. ఏప్రిల్‌లో పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా భారత సైన్యం 2025 మే 7న పాక్‌పై 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. భారత సైన్యం పాక్ గడ్డపైకి దూసుకెళ్లి ఉగ్రవాద స్థావరాలను ఊచకోత కోస్తుంటే.. తట్టుకోలేక పాక్ ఆర్మీ చేతులెత్తేసింది. ఆ దెబ్బకు తాళలేక పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) స్వయంగా భారత సైనిక అధికారులకు ఫోన్ చేసి కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నారు. కానీ ఈ క్రెడిట్ మొత్తాన్ని ట్రంప్ తన ఖాతాలో వేసుకుంటున్న విషయం తెలిసిందే. మధ్యవర్తిత్వం వహించి యుద్ధాన్ని ఆపేశానని, ప్రపంచంలో ఎనిమిది యుద్ధాలను ఆపానంటూ పదే పదే ప్రస్తావిస్తున్నారు. దీనికి పాక్ ప్రధాని కూడా అవునంటూ తలాడిస్తున్నారు. వీరిద్దరికీ భారత విదేశాంగ శాఖ గతంలో గట్టిగానే చెక్ పెట్టింది. ఈ వ్యవహారంలో అసలు మూడో దేశ ప్రమేయమే లేదని, పాక్ సైన్యమే స్వయంగా కాల్పుల విరమణ కోరిందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.

### సంచలన వ్యాఖ్యలతో హెడ్‌లైన్స్‌లో రాహుల్..

## సరికొత్త రాజకీయ వ్యూహంపై చర్చ

ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల తరచుగా చేస్తున్న పదును సంచలన, వివాదాస్పద వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి. ఆయన అనుసరిస్తున్న ఈ సరికొత్త రాజకీయ శైలి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియాను ఆకర్షించే విధానాన్ని పోలి ఉందంటూ పలువురు విశ్లేషకులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. నిరంతరం సంచలన ఆరోపణలతో 'హెడ్‌లైన్స్'లో నిలవడం, ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేయడం ద్వారా పొలిటికల్ మైలేజ్ సాధించే ట్రంప్ మార్క్ వ్యూహాన్నే రాహుల్ కూడా ఎంచుకున్నారా అనే కోణంలో విశ్లేషణలు వస్తున్నాయి. 'న్యూస్18' నిన్న (4న) ప్రచురించిన ఒక ప్రత్యేక విశ్లేషణాత్మక కథనంలో రాహుల్ గాంధీ ప్రచార శైలిని సుదీర్ఘంగా ప్రస్తావించింది. నిరంతరం చర్చల్లో నిలవడం, నెరేటివ్‌ను తన వైపునకు తిప్పుకోవడం, మీడియా తనను విస్మరించలేని పరిస్థితిని కల్పించడంలో రాహుల్ విజయవంతం అవుతున్నారని పేర్కొంది. ఇటీవల భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం పై స్పందిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయారని, భారత్ ఎవరికీ సేవకుడు కాదంటూ రాహుల్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు పార్లమెంట్ లోపల, వెలుపల పెద్ద దుమారాన్ని రేపాయి. అలాగే విదేశీ జాతీయ సంస్థల సమగ్రత, పేపర్ లీకేజీలు, విదేశీ విధానాలపై ఆయన చేస్తున్న ఆరోపణలు అధికార బీజేపీని తక్షణమే స్పందించేలా చేస్తున్నాయి.

ట్రంప్ శైలి - రాజకీయ వ్యూహాలు

ఈ తరహా రాజకీయ వ్యూహం గతంలో డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చేసిన సంచలన పోస్టులను, వివాదాస్పద వ్యాఖ్యలను గుర్తుచేస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్లమెంట్‌లో ప్రధాని మోదీని కౌగిలించుకుని కన్నుగీటడం లేదా టీలో బిస్కెట్ ముంచడం వంటి చిన్న చిన్న హావభావాల నుంచి.. తీవ్రమైన అంతర్జాతీయ ఒప్పందాల వరకు ప్రతి అంశాన్ని ఆయన సృష్టిస్తున్న 'హైప్' అంతా వ్యూహాత్మకంగా సాగుతోందని తెలుస్తోంది. అయితే, రాహుల్ గాంధీ ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను, జవాబుదారీతనాన్ని ప్రశ్నిస్తున్నారని, ప్రధాన స్రవంతి మీడియా విస్మరిస్తున్న అంశాలను ఆయన ప్రజల ముందుకు తెస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు గట్టిగా సమర్థిస్తున్నాయి. మరోవైపు, ప్రతిపక్ష నేతగా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న రాహుల్ గాంధీ.. ఎలాంటి ఆధారాలు లేకుండా విదేశీ గడ్డపై, పార్లమెంట్‌లో ఇష్టానుసారం తీవ్ర ఆరోపణలు చేయడం వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుందని, కాకుండా విపక్ష విశ్వసనీయత కోల్పోయే ప్రమాదం ఉందని బీజేపీ తీవ్రంగా విమర్శిస్తోంది. గతంలో రఫేల్ డీల్ విషయంలో చేసిన ఆరోపణలు ఇలాగే ఆరోపణలు చేసి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. రాహుల్ గాంధీ కానీ, కాంగ్రెస్ అధిష్ఠానం కానీ ఈ ట్రంప్ పోలికలను నేరుగా ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ.. రాబోయే ఎన్నికల సన్నాహాల నేపథ్యంలో ఉభయ పక్షాల మధ్య మీడియా వేదికగా సాగుతున్న ఈ ప్రచార యుద్ధం రాజకీయాలను మరింత వేడెక్కిస్తోంది.

### పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి..

## సాగు, తాగునీరు అందిస్తాం

నాగర్‌కర్నూల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సమీక్షకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో రోజు నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించారు. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర చేరుకుని పీఆర్ఎల్ఐఎస్ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 కాలువల నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి కాలువల నిర్మాణ పనులను సందర్శించి, జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### పాలమూరు-రంగారెడ్డి పనులతో

# కేసీఆర్ ఇంట్లో కనకవర్షం

మొదటి పేజి తరువాయి

రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నా. మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం.

అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు

కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్ ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారు?

### నాపై కోపంతో ఆ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు

మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు.

బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు

జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాం"అని రేవంత్ అన్నారు.

### జనసేన రాజ్యసభ అభ్యర్థిని

## ఖరారు చేసిన పవన్ కల్యాణ్?

అమరావతి: ఏపీలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్డీయే కూటమి సీట్ల పంపకాలు పూర్తయ్యాయి. టీడీపీ 3, జనసేన ఒక స్థానంలో పోటీ చేయబోతున్నాయి. ఈ మేరకు కూటమి పెద్దలు నిర్ణయాన్ని ప్రకటించారు. ఇక జనసేన కోటాకు దక్కిన ఆ ఒక్క రాజ్యసభ స్థానం నుంచి పార్లమెంట్‌కు వెళ్లే అభ్యర్థిని ఆ పార్టీ దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరును జనసేన అధినేత పవన్ కల్యాణ్ దాదాపు ఖరారు చేశారని, ఈ సాయంత్రమే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎవరీ లింగమనేని రమేశ్?

ఈయన ఏపీలో సుపరిచితులైన బిజినెస్ మ్యాన్. ప్రసిద్ధ 'లింగమనేని ఎస్టేట్స్', 'ఎల్ఈపీఎల్ గ్రూప్' సంస్థలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. విమానయాన రంగంలోకి కూడా ప్రవేశించి, ప్రాంతీయ విమానయాన సంస్థ 'ఎయిర్ కోస్టా'ను స్థాపించారు. గతంలో ఈయన టీడీపీ అధినేత చంద్రబాబుకి అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. అయితే, చాలా కాలంగా పవన్ ఈయన పేరును రాజ్యసభ స్థానానికి పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి సీట్ల సర్దుబాటు ముగియడం, జనసేన అభ్యర్థిగా లింగమనేని పేరు దాదాపు ఖరారు కావడంతో ఏపీ రాజ్యసభ ఎన్నికల రాజకీయం మరింత ఆసక్తికరంగా మారింది.

# ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి

మొదటి పేజి తరువాయి

అర్థవంతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అటు పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇస్తూనే... ఇటు ఒక భావోద్వేగపూరితమైన వ్యక్తిగత స్పర్శతో ఆయన తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఎన్టీఆర్ జిల్లాలోని మూలపాడు 'బటర్ ఫ్లై పార్క్' (సీతాకోకచిలుకల పార్క్)ను సందర్శించిన పవన్ కల్యాణ్... అక్కడ ఎంతో అరుదైన, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన 'తెల్ల పొనికి' మొక్కను నాటారు. ప్రపంచప్రసిద్ధి చెందిన కొండపల్లి బొమ్మల తయారీకి ఈ తెల్ల పొనికి కర్రనే ఉపయోగిస్తారు. ఈ అరుదైన మొక్కను పవన్ కల్యాణ్ తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ నాటడం విశేషం. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక బహిరంగ విజ్ఞప్తి చేశారు. "మనకు జన్మనిచ్చిన తల్లిపై ప్రేమతో, గౌరవంతో ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరిట కనీసం ఒక్క మొక్కనైనా నాటాలి. మనమంతా కలిసికట్టుగా పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

### 2.5 కోట్ల 'విత్తన బంతుల' భారీ ఉద్యమం!

రాష్ట్రంలో అడవుల శాతాన్ని, పచ్చదనాన్ని భారీగా పెంచే లక్ష్యంతో పవన్ అత్యంత ప్రతిష్టాత్మకమైన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఒక భారీ టార్గెట్‌ను నిర్దేశించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2.5 కోట్ల విత్తన బంతులను సిద్ధం చేసి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాలు, బంజరు భూములు, ప్రభుత్వ ఖాళీ స్థలాలలో చల్లడం ద్వారా సహజసిద్ధంగా అడవుల పునరుత్పత్తి జరిగేలా ప్లాన్ చేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలన్నా, పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నా ఇలాంటి హరిత కార్యక్రమాలు అత్యంత కీలకమని పవన్ నొక్కి చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ పచ్చని ఉద్యమంలో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు.

## ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి

ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగ అభివృద్ధికి తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. భారతదేశ సముద్ర ఆహార ఉత్పత్తిలో, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు గణాంకాలతో వివరించారు. "దేశ మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతం, రొయ్యల ఉత్పత్తిలో ఏకంగా 66 శాతం మనదే. దేశ సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 38 శాతం, అంటే సుమారు రూ.28,000 కోట్లకు పైగా ఏపీ నుంచే సమకూరుతోంది. ప్రపంచ సీ-ఫుడ్ వ్యాపారంలో భారత్ వాటా కేవలం 5 శాతమే ఉంది. దీన్ని పెంచడానికి అపార అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, దేశ ఎగుమతులు కూడా వృద్ధి చెందుతాయి" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆక్వా రంగం సమగ్రాభివృద్ధికి ఒక బృహత్ ప్రణాళికను చంద్రబాబు ప్రకటించారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఒక 'ఆక్వా కారిడార్' అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. "ఈ కారిడార్‌లో పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఒక సమగ్ర ఎకో సిస్టం ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే మా లక్ష్యం. 'పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్' అనే విధానంతో ముందుకు సాగుతాం" అని తెలిపారు. 'ఆంధ్రా రొయ్య... ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు 15 రోజుల్లోగా అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. "21వ శతాబ్దం నరేంద్ర మోదీదే. సరైన సమయంలో దేశానికి దొరికిన సరైన నేత ఆయన. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా కృషి చేస్తున్నారు. ఆయనను మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు అన్నారు. ఈ సమావేశానికి తాను సైకిల్‌పై వచ్చానని, సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని సూచించారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తా..
## మంత్రి రాజీనామాపై డీకే శివకుమార్

మొదటి పేజి తరువాయి

ఆయనకున్న అసంతృప్తి నేపథ్యంలో, తానే స్వయంగా మాట్లాడి, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని వెల్లడించారు. అయితే కర్ణాటక సర్కారులో కేవలం రామలింగారెడ్డి ఒక్కరే కాకుండా.. డీకే శివకుమార్ శాఖల కేటాయింపులపై మరికొందరు సీనియర్ మంత్రులు కూడా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు రాజకీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. కీలకమైన హోం, ఆర్థిక, మైనింగ్ వంటి శాఖలు తమకు దక్కకపోవడంపై కనీసం నలుగురు సీనియర్ మంత్రులు డీకేఎస్‌పై గుర్రుగా ఉన్నట్లు సమాచారం. వీరంతా త్వరలోనే ఢిల్లీ వెళ్లి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే ఉంటానని, ఇప్పుడు బెంగళూరు అభివృద్ధి శాఖ ఇచ్చినా ఒప్పుకోనని రామలింగారెడ్డి భీష్మించుకు కూర్చోవడం డీకే శివకుమార్‌కు సవాల్‌గా మారింది. ఇక ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విభేదాలు ముదిరిపోయాయని, ముఖ్యమంత్రిని మార్చినంత మాత్రాన ఆ పార్టీ మారదని వ్యాఖ్యానించారు.

### 9న తిరుపతి, 12న అమరావతి,

# 15న విశాఖలో నిర్వహణ

అమరావతి: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ పన్నెండేళ్ల పాలన, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన విజయాలు, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని 24 థీమ్‌లతో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన ఎన్డీయే పక్షాల నేతల సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సంక్షేమంపై ఈ నెల 9న తిరుపతిలో, పాలనా సంస్కరణలపై 12న అమరావతిలో, అభివృద్ధి కార్యక్రమాలపై 15న విశాఖపట్నంలో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ ప్రకటించిన పొదుపు చర్యల్ని పాటిస్తూనే ప్రచార కార్యక్రమాలు నిర్వహించేలా కార్యచరణ రూపొందిస్తున్నామని సమావేశం అనంతరం పల్లా శ్రీనివాసరావు, నాదెండ్ల మనోహర్, మాధవ్ విలేకరులకు వెల్లడించారు. వాటిలో కేంద్ర మంత్రులు, భాజపా పెద్దలు పాల్గొంటారని తెలిపారు. "కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్డీయే ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ, పాలనా సంస్కరణలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై ప్రధానంగా చర్చించాం. ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకూ రాష్ట్రస్థాయి నుంచి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం. మూడు పార్టీల నుంచి ముఖ్య నేతలు మొదలు కార్యకర్తల వరకూ భాగస్వాములవుతారు. త్వరలో దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేస్తాం" అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. "24 నెలల్లో చేపట్టిన 24 ప్రధాన కార్యక్రమాలు, పథకాలపై ప్రచారం నిర్వహిస్తాం. ప్రజల ఆశీస్సులు కోరతాం" అని నాదెండ్ల మనోహర్ తెలిపారు. "12 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి, పేదల సంక్షేమం అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని భాజపా అధిష్ఠానం నిర్ణయించింది. వాటికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన కార్యక్రమాల్ని జోడిస్తాం. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. పాలనా సంస్కరణలతో ప్రజల జీవితాల్లో మార్పులు వచ్చాయి. విశాఖ రైల్వేజోన్ కల నెరవేరింది. అమరావతి, పోలవరం నిర్మాణాలు సాకారమయ్యాయి. వీటన్నింటినీ కళ్లకు కట్టినట్టు వివరిస్తాం" అని మాధవ్ పేర్కొన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్న శక్తుల్ని అణగదొక్కాలని మాధవ్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై తెలంగాణలో కొన్ని పార్టీల నాయకులు చేస్తున్న విమర్శల్ని విలేకరులు ప్రస్తావించగా... "భాజపా, తెదేపా, జనసేన ఉమ్మడిగా ముందుకు వెళ్లడాన్ని జీర్ణించుకోలేక కొందరు విమర్శలు చేస్తున్నారు. కొందరు విశ్లేషకులు... స్వయంప్రకటిత మేధావుల ముసుగులో చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యల్ని తిప్పికొడతాం. బీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో దాని శాఖలు ఏర్పాటు చేసింది. అలాంటి పార్టీ పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం సరికాదు" అని మాధవ్ అన్నారు. తెదేపా, జనసేనకు రాజ్యసభ సీట్లు ఉంటే భాజపాకు ఉన్నట్టేనని ఆయన పేర్కొన్నారు.

## భూసేకరణ తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణం పనులు

హైదరాబాద్: పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 6 నెలల్లో కర్వెన రిజర్వాయర్ వరకు నీరందించాలని చెప్పారు. దీంతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను సత్వరంగా పూర్తి చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టంచేశారు. ప్రధాన భూసేకరణను వేగవంతం చేయాలని, ఈ బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ పూర్తయిన తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వేగంగా పూర్తిచేయాలని సీఎం చెప్పారు. నార్లాపూర్, ఏదుల, కరివెన రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికాగా, వీటి లింకేజీకి సంబంధించి పెండింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. వీటికి నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పారు. నెలవారీగా ప్రాజెక్టు పనులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నిధులతో పూర్తయ్యే పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. ఆరు నెలల్లోగా కరివెన రిజర్వాయర్ వరకు నీళ్లు అందించే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మరో 15 రోజుల తర్వాత ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షిస్తానన్నారు. ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన తొలి రోజు గురువారం చకచకా సాగింది. కర్ణాటక రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి పలు ప్రాజెక్టులను సందర్శించారు. కొడంగల్-- నారాయణపేట-- మక్తల్ ఎత్తిపోతలు, గుడ్డెందొడ్డి పంప్‌హౌస్ పనుల ప్రగతిపై స్వయంగా ఆరా తీశారు. కోయిల్‌సాగర్, కృష్ణా, భీమా నదులపై రోడ్ కం బరాజ్‌ల ప్రతిపాదిత స్థలం, జూరాల డ్యామ్‌ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. రాత్రి 10 గంటల వరకు సమీక్ష నిర్వహించిన అనంతరం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో రేవంత్‌రెడ్డి బస చేశారు. శుక్రవారం పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతలు, ఎంజీకేఎల్ఐలో భాగమైన పలు రిజర్వాయర్లు, పంప్‌హౌస్ పనులను పరిశీలించనున్నారు. సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ రోడ్‌లో ఉన్న మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. మక్తల్--నారాయణపేట-- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటిపారుదల రంగాన్ని మరింత బలోపేతం చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పాలమూరు-- రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీల వారీగా పురోగతిపై రేవంత్‌రెడ్డి ఒక్కో ప్యాకేజీలో పెండింగ్ పనులకు గత కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులు నూరు శాతం పూర్తికాగా, ఏదుల రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. వట్టెం రిజర్వాయర్ కట్ట పనులు పూర్తికాగా, ప్రస్తుతం కాంక్రీట్, రివిట్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయన్నారు. గడువులోగా పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల అంచనాలను త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు. గరిష్ట ప్రయోజనాల కోసం కీలకమైన కాల్వల నిర్మాణం పైనే అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించాలని సీఎం ఆదేశించినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. నిధుల అవసరాలు, కాలపరిమితులతో కూడిన వాస్తవిక గడువులను సిద్ధం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారన్నారు. కోర్టు కేసుల్లో ఉన్నవి, పనులపై స్టే విధించిన వాటి విషయంలో క్రియాశీలకంగా పనిచేయాలన్నారు.

### భారత ఏఐ ఆశలకు బిగ్ బూస్ట్..

## ఆస్ట్రేలియన్ కంపెనీ రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు

ఢిల్లీ: భారత్‌ను అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ హబ్‌గా మార్చే దిశగా చరిత్రాత్మక ముందడుగు పడింది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ డేటా సెంటర్ల సంస్థ 'ఎయిర్‌ట్రంక్' రాబోయే నాలుగేళ్లలో మనదేశంలో ఏకంగా 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 2.50 లక్షల కోట్లు) భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా భారతదేశంలో ఐదు గిగావాట్ల సామర్థ్యం గల సరికొత్త డేటా సెంటర్లను నిర్మించనున్నారు. సిడ్నీ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఎయిర్‌ట్రంక్ సంస్థకు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు బ్లాక్‌స్టోన్, కెనడియన్ పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ నిధులు సమకూరుస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా' సంస్థను కొనుగోలు చేయడం ద్వారా ఎయిర్‌ట్రంక్ భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది. మోదీ శుక్రవారం ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో సమావేశమయ్యారు. అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలోనే ఇది భారీ పెట్టుబడి అని కొనియాడారు. ఈ ప్రాజెక్ట్ వల్ల దేశంలో లక్షలాది ఉపాధి అవకాశాలు లభిస్తాయని, స్థానిక సప్లై చైన్ వ్యవస్థ బలోపేతం అవుతుందని, క్లౌడ్ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎయిర్‌ట్రంక్ సంస్థ ముంబై, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్మిస్తోంది. తాజా రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రేసు తీవ్రమవుతోందని, పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ చూపిస్తున్న వేగం, పారదర్శకత తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాబిన్ ఖుదా ప్రశంసించారు. భారత్‌లో ఇప్పటికే గూగుల్ సంస్థ విశాఖపట్నంలో తన మొదటి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయడానికి 15 బిలియన్ డాలర్ల (2026-2030 మధ్య) పెట్టుబడులను ప్రకటించింది. అలాగే దేశీయ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ కూడా ఏఐ, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం సుమారు 100 బిలియన్ డాలర్లకు పైగా భారీ నిధులను కేటాయించాయి. ఈ భారీ పెట్టుబడుల ప్రవాహం భారత్‌ను ప్రపంచ డిజిటల్ అడ్డాగా మార్చబోతోంది.

# పచ్చదనమే భావితరాలకు భద్రమైన భవిష్యత్ .

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. జూన్ 5. (లోకల్ గైడ్).ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఎల్‌జీ రోడ్డులోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ( నాక్) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ " ఇన్స్పైర్డ్ బై నేచర్. ఫర్ క్లైమేట్ ఫర్ ఔర్ ఫ్యూచర్ . " అనే నినాదానికి అనుగుణంగా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, వాతావరణ మార్పుల నియంత్రణలో వృక్ష సంపద కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.పండ్ల చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన ఫలాలు అందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. నల్గొండలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర రోడ్లు ,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మార్గదర్శకత్వంలో నల్గొండ నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. హరిత నల్గొండ నిర్మాణ లక్ష్యంతో నగర వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతున్నామని మేయర్ వెల్లడించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మలచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. నగరంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున వృక్షారోపణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపుదల ద్వారా కాలుష్య రహిత, ఆరోగ్యవంతమైన నల్గొండ నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నెం.21 కార్పొరేటర్ ఇబ్రహీం మొహమ్మద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్, అసిస్టెంట్ ఇంజనీర్ అసీం బాబా, శానిటరీ సూపర్వైజర్ శ్రీ జి. శ్రీనివాస్, వార్డు అధికారి శ్రీమతి సి.హెచ్. శృతి, హరితహారం సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది, ఎన్‌ఏసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కళాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం అభిందనీయం



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ప్రభుత్వం పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలకు సహకారం అందిస్తూ వాటి అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షులు ఆర్. సత్యం అన్నారుజిల్లా నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మూడు రోజుల పద్య నాటకోత్సవాలలో రెండవ రోజు జరిగిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ గ్రామ, పట్టణ స్థాయిలో కళాకారులు కళా సంస్థలను ఏర్పాటు చేసుకొని మాస్టర్లను పోషిస్తూ తమలోని నటనా నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ సందేశాత్మక, ఆధ్యాత్మిక, పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తున్నారని ఆయన అన్నారు. ఇది అత్యంత వ్యయప్రయాసలతో కూడుకున్నది కావడంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ప్రభుత్వం సహకరించడం ఆనందదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మధుర గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం గారి జయంతి సందర్భంగా క్లాస్మేట్ క్లబ్ వారు స్థానిక గాయని గాయకులు పద్మాలయ ఆచార్య, ముక్తావళి, ఇద్రిష్, సరిత, బి. నర్సింహారెడ్డి, జి.మురళీధర్ రావు, మరియు కళాకారులు ఆర్. సత్యం విష్ణుమూర్తి, జియాజీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాటక సమాజాల సమాఖ్య గౌరవాధ్యక్షులు టి రఘుపతి బి నరసింహారెడ్డి డి. రాములు, బ్రహ్మాచారి కార్యదర్శి వీరభద్రం కోశాధికారి టి.రఘునందన్, సురేష్ బాబు, సంజీవగౌడ్, సుదర్శనాచారీ, వహీద్ ఖాన్, గడ్డం విజయ్ తో పాటు అనేకమంది కళాకారులు పాల్గొని వివిధ సన్నివేశాలతో తమనాటనా నైపుణ్యాలను ప్రదర్శించారు.

# నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరమునకు సంబంధించి అడ్మిషన్లు

ప్రారంభమైన సందర్భంలో కళాశాల కరపత్రాలను నాగలవంచ రైల్వే కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్ చేతుల మీదగా ప్రారంభించారు. నాగలవంచ కాలనీ



:లోకల్ గైడ్ :ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి నవీన్ బాబు మాట్లాడుతూ తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం లలో ఒత్తిడి లేని విద్యను ఉచితముగా అందించుటకు జనరల్ మరియు ఒకేషనల్ కోర్సులలో ఎంపీసీ బైపిసి బిసీఈసీ బిహెచ్ఈసి ఎల్ఎండిటి బిఏసిపి అండ్ ఎం మొదలగు కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవిఅని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర మాట్లాడుతూ నాగులువంచ జూనియర్ కళాశాల విద్యార్థుల భవిష్యత్తును వారి కలలను సాకారం చేయటమే లక్ష్యముగా భావించి పనిచేయుచున్న ప్రిన్సిపల్ నవీన్ బాబుకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.అలాగే ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి రమేష్ మాట్లాడుతూ 2025 బి20 26 గత మార్చిలో వెలువడిన ఇంటర్ ఫలితాలలో నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన హాసిని అనే విద్యార్థిని ఎంపీసీలో 470 మార్కులకు గాను 448 మార్కులు సాధించి కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రథమ స్థానం సాధించినందుకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల ఉన్నతిలో పాటుపడే కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.అలాగే ఈ విద్యా సంవత్సరంలో టెన్త్ పాస్ అయినటువంటి విద్యార్థులు నాగులవంచ కళాశాలలో అడ్మిషన్లు పొంది గ్రామమునకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలియజేయడం జరిగినది .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు గ్రామ పెద్దలు మరియు యువతి యువకులు పంచాయితీ సెక్రటరీ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు ఎంపీడీఓ సుదర్శన్



నారాయణపేట జూన్ 5:మన జీవనానికి ఆధారమైన గాలి, నీరు, నేల, చెట్లు జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్తు సురక్షితమని నారాయణపేట ఎంపీడీఓ సుదర్శన్ అన్నారు.శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నారాయణపేట మండలం చిన్నజత్రం గ్రామంలో సర్పంచ్ నడిమింటి జ్యోతినాగేష్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ సుదర్శన్ మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు మానవాళి భవిష్యత్తుకు సవాళ్లుగా మారుతున్నా యనీ అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరం కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పరిశుభ్రమైన పచ్చని వాతావరణ నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సుజాత,ఉపాధి హామీ పిడి.వెంకట్రాములు,టి ఏ ప్రదీప్,ఉపసర్పంచ్ రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోనస్ డబ్బులు వేయ కుండా ప్రభుత్వం మోసం కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ



నారాయణపేట జూన్ 5:రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు కు క్వింటాలుకు 500 బోనస్ వేస్తామని ప్రకటించి వడ్లు కొనుగోలు కేంద్రాలలో రైతులు అమ్మి నెల రోజులు అయిన కూడా బోనస్ డబ్బులు వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వెంటనే రైతుల ఖాతాలో బోనస్ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. కొన్న వడ్ల డబ్బులు మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేశారనీ గత సంవ త్సరం మాదిరిగానే ఈ సంవ త్సరం కూడా యాసంగికి బోనస్ వేసేటట్లు లేరు అని అన్నారు. పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి, పంటలు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది వడ్లు అమ్మితే పెట్టుబడి కూడా రాలేదు అని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఒకవేళ ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీకి తెచ్చి పంటలు పండించిన వారి పరిస్థితి మరి గోరంగా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది ఇప్పటి వరకు రైతు భరోసా వేయ లేదని దాంతో రైతులు పంటపెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయి స్తున్నారని అప్పుకు వెళ్తే మునుపు తీసుకున్న అప్పు కడితే కొత్త అప్పు పుట్టే పరిస్థితి లేదని అన్నారు. రైతులను ఆదుకోవడం కోసం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని,యాసంగి రైతు భరోసా డబ్బులు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు.

# "ప్రజలకు ఉపాధి కల్పించడమే నిజమైన అభివృద్ధి

## సిద్దిపేటలో అద్వితీయ గార్మెంట్స్ పరిశ్రమ ప్రారంభించిన హరీశ్ రావు"





సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)జూన్ 5:ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడమే నిజమైన అభివృద్ధి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట ప్రశాంత్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "అద్వితీయ ఎంటర్‌ప్రైజెస్" దుస్తుల తయారీ పరిశ్రమను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, రోడ్లు, భవనాలు, కాలేజీలు నిర్మించడం మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజలకు ఉపాధి కల్పించి వారి జీవనోపాధిని మెరుగుపరచడమే అసలైన అభివృద్ధి అని పేర్కొన్నారు. సిద్దిపేట మహిళలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే తన కల టెక్ లైన్ మరియు అద్వితీయ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నెరవేరడం ఆనందంగా ఉందన్నారు.రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల యూనిఫాం ఆర్డర్ల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న టెక్ లైన్ అధినేత్రి భువనేశ్వరి కృషిని ఆయన ప్రశంసించారు. లాభాల కంటే ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ పరిశ్రమను ఏర్పాటు చేసిన కో-ఆపరేటివ్ చైర్మన్ తోట శ్రీకాంత్ రెడ్డి, వారి బృందాన్ని అభినందించారు.ప్రస్తుతం ఈ పరిశ్రమలో 70 మంది మహిళలు పనిచేస్తుండగా, త్వరలోనే స్టిచ్చింగ్ మరియు ప్యాకింగ్ విభాగాల్లో మరో 130 మందికి పైగా ఉపాధి లభించి మొత్తం 200 మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయని తెలిపారు. సాధారణంగా నెలరోజులు పట్టే శిక్షణను సిద్దిపేట మహిళలు కేవలం నాలుగు రోజుల్లోనే నేర్చుకోవడం వారి ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు.మహిళలు నాణ్యతతో కూడిన పనితీరును కనబరిస్తే మరిన్ని ఆర్డర్లు వచ్చి ఉపాధి అవకాశాలు రెట్టింపు అవుతాయని తెలిపారు. గతంలో 6 వేల మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందించినప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు అవసరమని చెప్పారు.మహిళల కృషి, నైపుణ్యంతో సిద్దిపేట భవిష్యత్తులో దేశంలో ప్రముఖ టెక్స్‌టైల్ హబ్‌గా ఎదిగే అవకాశం ఉందని హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. సంస్థ విస్తరణకు అవసరమైన ఆర్డర్ల కోసం ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలతో మాట్లాడి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సంస్థను తమ సొంత సంస్థగా భావించి కష్టపడాలని ఉద్యోగినులకు సూచిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# "పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందిద్దాం"

మల్లు లక్ష్మి ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిలుపు..



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. జూన్ 5. (లోకల్ గైడ్)ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. నల్లగొండలో ఎంవి ఎన్ ట్రస్ట్ భవనంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, నీటి వనరుల కాలుష్యం కారణంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, అనియంత్రిత వర్షాలు, నీటి కొరత వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని పేర్కొన్నారు.అడవులు భూమికి ఊపిరి తిత్తులాంటివని అన్నారు అక్రమ భూకబ్జాలు చెట్ల నరికివేత కనులతో కాలు పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు కట్టబట్టే చర్యల వలన వాతావరణ సమస్యలత దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు ఇటీవల కాలంలో చెట్లు నరికివేత వలన కోతులు వన్నె మృగాలు గ్రామాలపై పడి అనేక అనర్థాలకు లోన్ అవుతున్నాయని తెలియజేశారు. భూమి ,పర్యావరణ దోపిడిని అరికట్టాలని ప్రజలంతా ఐక్యమై పోరాటాలకు రావాలని అన్నారు.పర్యావరణ పరిరక్షణ ముఖ్య ఉద్దేశాలు ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రకృతి వనరులను కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, జీవ వైవిధ్యాన్ని రక్షించడం మరియు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం అని తెలిపారు.ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆమె కొన్ని ముఖ్యమైన పరిష్కార మార్గాలను సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలనీ,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి మరియు వాటిని సంరక్షించాలనీ తెలిపారు.నీటిని వృథా కాకుండా వినియోగించాలనీ , పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనీ, కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు.మహిళలు, యువత పర్యావరణ పరిరక్షణలో ముందుండాలనీ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామాలు, పట్టణాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సదస్సులో తీర్మానించారు. ప్రకృతిని కాపాడితేనే మానవ జీవనం సురక్షితంగా ఉంటుందని సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిటాసరోజ జిల్లా సహాయ కార్యదర్శి దామెర లక్ష్మి అరుణ తదితరులు పాల్గొన్నారు.



# : గీతంలో క్వాంటం టెక్నాలజీపై పరిశోధన

## -జేఆర్ఎఫ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

## -ఎంపికైన వారికి పీహెచ్‌డీ చేసే అవకాశం

GITAM
DEEMED TO BE UNIVERSITY

పఠాన్ చేరు, జూన్ 5 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో డీఎస్టీ నిధులతో "క్వాంటం టెక్నాలజీల కోసం షట్కోణ బోరాన్ నైట్రైడ్ (హెచ్-బిఎన్)లో రుణాత్మక ఆవేశం గల ఏక బోరాన్ ఖాళీల నిర్ధారిత సృష్టి, లక్షణాల నిర్ధారణ" ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టులో జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. అత్యాధునిక నానోఫ్యాబ్రికేషన్ పద్ధతులతో హెచ్-బిఎన్ లో క్వాంటం లోపాలను సృష్టించి, స్పెక్ట్రోస్కోపిక్, మైక్రోస్కోపిక్ విశ్లేషణల ద్వారా వాటి లక్షణాలను అధ్యయనం చేయడం ఈ పరిశోధన లక్ష్యమని తెలిపింది. ఈ ప్రాజెక్టును గీతం హైదరాబాద్, ఐఐటీ బొంబాయి, ఇటలీలోని సాపియెంజా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో బీటెక్ లేదా ఎంటెక్ అర్హతతో పాటు సెమీకండక్టర్ పరికరాలు, ఎలక్ట్రానిక్ మెటీరియల్స్‌పై అవగాహన ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గేట్ అర్హత, ఎక్స్ ఆర్ డి, ఎస్ఈఎం, ఏఎఫ్ఎం, ఫోటోల్యూమినిసెన్స్ (పిఎల్), రామన్ స్పెక్ట్రోస్కోపీపై అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితి గల ఈ జేఆర్ఎఫ్‌కు తొలి రెండేళ్లు నెలకు రూ.37 వేల ఫెలోషిప్, మూడో ఏడాది సీనియర్ రీసెర్చ్ ఫెలోగా రూ.42 వేల ఫెలోషిప్‌తో పాటు హెచ్ఆర్ఏ అందజేస్తారు. డాక్టర్ శాంతను సాహా ప్రధాన పరిశోధకుడిగా వ్యవహరించనున్న ఈ ప్రాజెక్టుకు డీఎస్టీ రూ.45.43 లక్షల గ్రాంటును మంజూరు చేసింది. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను ంయిష్ట్రు2ఏస్త్రిఖుఎ.వఎబ కు జూన్ 12లోగా పంపాలని సూచించారు. ఎంపికైన వారికి పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంటుందని వెల్లడించారు.

# గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడు అరెస్ట్

-నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులతో రూ.12 కోట్ల లావాదేవీలు..దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి



సైబరాబాద్, జూన్ 5 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): గండిపేట మండలంలోని సర్వే నెం.18లో ఉన్న సుమారు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకొని రెగ్యులరైజేషన్ చేయించు కునేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (ఫేక్ జీవోలు), తప్పుడు రెవెన్యూ రికార్డులు, ఇతర నకిలీ పత్రాలు సృష్టించిన వ్యవహారంలో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడిని నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు 2026 మే 23 న నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026 కింద కేసు నమోదు చేయబడింది. కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే నిమ్మల కుటుంబ సభ్యులు, రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రభీన్ కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. అనంతరం తదుపరి దర్యాప్తు నిమిత్తం వారికి పోలీస్ కస్టడీ మంజూరైంది. దర్యాప్తులో సేకరించిన ఆధారాల ప్రకారం బొల్లా బ్రహ్మానాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు పరస్పర కుట్ర పన్ని ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు అధికారిక పత్రాలు, నకిలీ రికార్డులు సృష్టించినట్లు వెల్లడైంది. ఈ కుట్రలో భాగంగా బొల్లా బ్రహ్మానాయుడు సుమారు రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో గుర్తించారు. అందులో నిమ్మల కుటుంబ సభ్యులకు రూ.4 కోట్లు, ఇప్పటికే అరెస్టైన నిందితుడు రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతర సంబంధిత వ్యక్తులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులను నకిలీ జీవోలు, నకిలీ ప్రభుత్వ అనుమతులు, తప్పుడు పత్రాల తయారీ ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించేందుకు వినియోగించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అరెస్టుకు ముందు బొల్లా బ్రహ్మానాయుడు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, కేసు తీవ్రత, దర్యాప్తు దశ, అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో పరారీలో ఉన్న బొల్లా బ్రహ్మానాయుడిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో తమిళనాడులోని కాంచీపురం ప్రాంతంలో అతని ఆచూకీ గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం బొల్లా బ్రహ్మానాయుడు పోలీసుల అదుపులో ఉండగా, చట్టపరమైన ప్రక్రియలో భాగంగా న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నారు. కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నకిలీ పత్రాల తయారీ, ప్రభుత్వ అధికారుల పేర్లు, సంతకాల దుర్వినియోగం, అలాగే ఈ కుట్రలో పాల్గొన్న ఇతర వ్యక్తుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# సరిహద్దులు దాటిన స్నేహ బంధం

-స్నేహానికి ప్రతీకగా నిలిచిన అనుబంధానికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

-సామాజిక ఐక్యత, మానవీయ విలువలను చాటిచెప్పే స్నేహ బంధం..మిరియాల ప్రీతమ్



శేరిలింగంపల్లి, జూన్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సరిహద్దులు, భాషలు, ప్రాంతాలు, సంస్కృతులు దాటి కొనసాగుతున్న స్నేహ బంధాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఇటువంటి అనుబంధాలు మానవీయ విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొంటూ ఈ స్నేహ బంధానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యూత్ నాయకులు మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ..స్నేహం అనేది కేవలం వ్యక్తుల మధ్య సంబంధం మాత్రమే కాదని, అది పరస్పర విశ్వాసం, గౌరవం, ప్రేమ, సహకారానికి ప్రతీక అని అన్నారు. భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన వ్యక్తులను ఒకే తాటిపైకి తీసుకువచ్చే శక్తి స్నేహానికే ఉందన్నారు. ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కాలంలో మానవ సంబంధాలను బలోపేతం చేసే స్నేహ బంధాలు సమాజంలో ఐక్యత, సామరస్యం పెంపొందించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. యువత మంచి స్నేహాలను పెంపొందించు కుంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేయడం ఈ స్నేహ బంధానికి మరింత ప్రాధాన్యతను తీసుకువచ్చిందని, ఇలాంటి అనుబంధాలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని మిరియాల ప్రీతమ్ తెలిపారు.

## ప్రకృతిని కాపాడకపోతే మనిషికి మనుగడే లేదు ఎంపి.డి కే.అరుణ



నారాయణపేట జూన్ 5: మన జీవనానికి ఆధారమైన గాలి, నీరు, నేల, చెట్లు జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్తు సురక్షితమని మనిషి మనుగడ సాధ్యమని పాలమూరు ఎంపీ డి కే అరుణ అన్నారు.శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నారాయణపేట మండలం సింగారం చౌరస్తా సమీపంలో ప్రధాని 12 ఏళ్ల విశ్వాసం.అభివృద్ధి,ప్రజా సంక్షేమం ప్రచార సేవా కమిటీ జిల్లా కన్వీనర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎంపీ డి కే అరుణ మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు మానవాళి భవిష్యత్తుకు సవాళ్లుగా మారుతున్నా యనీ అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరం తల్లి పేరున కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పరిశుభ్రమైన పచ్చని వాతావరణ నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి ,ప్రతాప్ రెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి,ప్రజాప్రతినిధులు,జిల్లా,మండల,పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. జూన్ 5. (లోకల్ గైడ్).డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలి ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను



ఆదేశించారు.శుక్రవారం ఆయన నల్గొండ లోని గొల్లగూడ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు. గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అద్దాలు, ఎలక్ట్రికల్ వైరింగ్, విండోలు, వాటర్ ట్యాంకులు, నీటి ట్యాపులు, లైటింగ్, తలుపులు, బాత్రూములు, టాయిలెట్లు, కిచెన్ గదులు, తదితర పనులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే గృహ సముదాయం మొత్తాన్ని శుభ్రపరచి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు.లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని , జిమ్, పార్కులు, బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, జిరాక్స్ సెంటర్, మీ సేవా కేంద్రం, మెడికల్ షాప్, కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ ఆదేశించారు. అదేవిధంగా లే అవుట్ బోర్డులు, దిశా నిర్దేశిక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గృహ సముదాయం పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, వైకుంఠధామం, క్రీడా మైదానం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం మాత్రమే కాకుండా, నివాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకేచోట అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లా గృహ నిర్మాణ పీడి రాజ్ కుమార్ ,పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్,కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, కాంట్రాక్టర్ సైదిరెడ్డి, సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు

## అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత ఇంచర్ల కార్యక్రమంలో మంత్రి సీతక్క



ములుగు : లోకల్ గైడ్ :99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ములుగు జిల్లా ఇంచర్ల ఏకో పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ముఖ్య అటవీ సంరక్షణాధికారి (కాళేశ్వరం జోన్) బి. ప్రభాకర్ ఐఎఫ్ఎస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, సీసీఎఫ్ ప్రభాకర్, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్ తదితరులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించిన అతిథులు అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించిన చిత్రాలను పరిశీలించారు. ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పో, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఇంచర్ల ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బందాల గ్రామంలో రూ 30 లక్షల అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవం



ములుగు జిల్లా, తాడ్వాయి : లోకల్ గైడ్ :ములుగు జిల్లా తాడ్వాయి మండలం బందాల గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ భవనం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్ఓ వికాస్ మీనా, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవాన్ష్ మొదటి పుట్టినరోజు వేడుక.. పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించిన మిత్రబృందం..



లోకల్ గైడ్ తెలంగాణ/రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల పరిధిలో కమ్మదనం గ్రామ ప్రముఖ రియాల్టర్ శేఖర్ ముద్దుల తనయుడు దేవాన్ష్ మొదటి పుట్టినరోజు వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించారు.. ఈ వేడుకలో పాల్గొన్న గ్రామ డిప్యూటీ సర్పంచ్ జగన్,జర్నలిస్టు బూర్గుల రమేష్, ఎడ్ల లక్ష్మణ్, తదితరులు పాల్గొని చిన్నారుడు దేవాన్ష్ ఆశీస్సులు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పలువురు దేవాన్ష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఎదిగి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇలాంటి వేడుకలు పిల్లల జీవితాల్లో కొన్ని రోజులు మరుపురానివిగా నిలిచిపోతాయని, అటువంటి ప్రత్యేక సందర్భాలను ఈ విధంగా కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో జరుపుకోవడం భవిష్యత్తులో మధుర జ్ఞాపకాలుగా మిగులుతాయని ఆకాంక్షంచారు..

## జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ పాఠశాలలో ఫీజు రాయితి ఇవ్వాలి.

టీ యూ డబ్ల్యూ జే ( ఐజేయు )

ఆధ్వర్యంలో డి ఈ ఓ కు వినతి పత్రం అందజేత.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .జూన్ 5.( లోకల్ గైడ్) నల్గొండ జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని టి యు డబ్ల్యు జె ( ఐ జె యూ ) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖఅధికారి సుశీంద్రావు రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ప్రింట్ ఒ ఎలక్ట్రానిక్ మీడియాలో



పనిచేయుచున్న జర్నలిస్టు పిల్లలు వివిధ ప్రవేట్ పాఠశాలలో చదువుతున్నారని అన్నారు. ప్రవేటు పాఠశాలలో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించాల్సి ఉండటంతో ఆ ఫీజులను చెల్లించలేక చాలా ఇబ్బందులు పడుచున్నారు. పాఠశాల మేనేజ్మెంటు వారు ఫీజులు చెల్లించాలని వత్తిడి చేయడంతో కొందరు విద్యార్థిని విద్యార్థులు ఫీజులు చెల్లించలేక మధ్యలోనే విద్యను నిలుపుదల చేయుచున్నారు.జర్నలిస్టు కుటుంబంలోని ఒకరికి పూర్తి రాయితిని, ఇంకొకరికి 50%, మరొకరి 30% రాయితీని ఇతర జిల్లాలో కల్పించడం జరుగుచున్నది.కావున మన నల్లగొండ జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు 75% ఫీజు రాయితీని కల్పించగలరని అదేవిధంగా వెంటనే తగిన ఉత్తర్వులు జారీ చేయగలరని కోరుచున్నాము. వినతి పత్రం అందజేసిన వాళ్ళు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాదరి యాదగిరి, ఎర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బోజు మదనాచారి, ఉపాధ్యక్షులు గంగాధర వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు వంగాల శ్రీనివాసరెడ్డి ,ఎండి సయ్యద్ , పిట్టల రామకృష్ణ ,పరమేష్ ,దశరథ ఉయ్యాల లింగయ్య డిఎస్ యాదవ్,దొటి శ్రీనివాస్, సోమచంద్రశేఖర్ , పి అశోక్ కుమార్ ,వుర రమేష్ , ఎస్ రాంప్రసాద్ , టి శంకర్ పాల్గొన్నారు.

## చిన్నారిపై అత్యాచారం కేసులో తండ్రి, కుమారుడికి యావజ్జీవ కారాగార శిక్ష

-బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం మంజూరు చేసిన ప్రత్యేక పోక్సో కోర్టు-సైబరాబాద్ క్రైమ్స్ డిజిపి..ముత్యం రెడ్డి



సైబరాబాద్, జూన్ 5 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మేడ్చల్ పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన చిన్నారిపై అత్యాచారం కేసులో నిందితులు ఏ1 శివ కుమార్, ఏ2 శామ్యూల్ అలియాస్ సమిల్ అలియాస్ సమేల్లను కోర్టు దోషులుగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అలాగే ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించగా, బాధిత చిన్నారికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. 2023 ఆగస్టు 10న బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న 7 ఏళ్ల చిన్నారిని పొరుగింటివారైన శివ కుమార్, అతని కుమారుడు శామ్యూల్ తమ ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఘటన అనంతరం నిందితులు పరారయ్యారు. దర్యాప్తు అధికారి 2023 ఆగస్టు 12న నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపించారు. అనంతరం చార్జిషీట్ దాఖలు చేయగా, విచారణ పూర్తిచేసిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.వెంకటేష్ నిందితులను దోషులుగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా మొక్కల నాటకం



సైబరాబాద్, జూన్ 5 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నల్లగండ్ల హుడా కాలనీలోని ఇల్యూషన్ థీమ్ పార్క్‌లో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి.శ్రీజన, జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మలెంపాటి, అదనపు కమిషనర్ వి.వి.ఎల్. సుభద్రా దేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ప్రకృతి స్ఫూర్తిగా..వాతావరణం కోసం..మన భవిష్యత్తు కోసం" అనే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందేశాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వారు వివరించారు. పర్యావరణ పరిరక్షణ భావితరాల భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సుమారు 4.32 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఇల్యూషన్ థీమ్ పార్క్‌లో 350 స్వదేశీ వృక్ష జాతులను నాటినట్లు అధికారులు తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ, పట్టణ హరితీకరణ, సుస్థిర అభివృద్ధి కోసం కార్పొరేషన్ కట్టుబడి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. హరిత ప్రాంతాలను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## టి ఆర్ ఎస్ లో చేరిన మాజీ జెడ్పీటీసీవెంకటన్న,అనుచరులు




నారాయణపేట జూన్ 5:నారాయణ పేట్ జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండల మాజి జడ్పీటీసీ సి ఎచ్ వెంకటన్న ఆధ్వర్యంలో ఆయన అనుచరులు శుక్రవారం హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో టి ఆర్ ఎస్ అధ్యక్షురాలు కవిత సమక్షంలో భారీ ఎత్తున చేరారు.వారందరికీ కవిత సాధారంగా పార్టీ లోకి స్వాగతం పలికారు.పార్టీలో చేరిన వారంతా తెలంగాణ అస్థిత్వం కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో నారాయణ పేట జిల్లా టి ఆర్ ఎస్ అధ్యక్షులు గవి నో ళ్ల శ్రీనివాస్,అలంపూర్ జోగులాంబ జిల్లా నాయకులు రంజిత్ కుమార్, రాష్ట్ర పార్టీ నారాయణపేట జిల్లా అబ్జెర్వర్ పుల్లూరు శ్రీనివాస్ రావు, వివిధ మండలల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ 34 వ వార్డులో 'నేహన్ మెడికల్ షాప్' ప్రారంభోత్సవం

ఎమ్మెల్యే మురళీనాయక్



(లోకల్ గైడ్ మహబూబాబాద్ )మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక రోడ్డు, స్థానిక 34వ వార్డు పరిధిలో శ్రీను నాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన "నేహన్ మెడికల్ షాప్" ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు (మీూ) డా. మురళీనాయక్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి మెడికల్ షాప్‌ను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు, ఔషధాలు అందించేందుకు ఇటువంటి సంస్థలు పనిచేయాలని సూచించారు,?ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి జ్యోతి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్ చౌదరి, స్థానిక వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య శ్రేణులు, యజమాని శ్రీను నాయక్ బంధుమిత్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీజీ 20 లీగ్ లో నల్లగొండ ప్రాంతానికి ప్రాతిత్య వహిస్తున్న అనురాగ్ నల్లగొండ నైట్ జట్టు జెర్సీ ఆవిష్కరణ.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .జూన్ 5 .(లోకల్ గైడ్)టీజీ20 లీగ్లో నల్గొండ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అనురాగ్ నల్గొండ నైట్స్ జట్టు జెర్సీని నేడు నల్గొండలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు చెందిన 25-30 క్రికెట్ అకాడమీల నుంచి 700 మందికి పైగా యువ క్రికెటర్లు, 60 మందికి పైగా కోచ్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన అనురాగ్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ స్ట్రాటజీ అనురాగ్ పల్లా, గ్రామీణ ప్రాంతాల నుంచి వెలుగులోకి వస్తున్న క్రికెట్ ప్రతిభను ప్రోత్సహించేందుకు అనురాగ్ యూనివర్సిటీ దీర్ఘకాలిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులకు కోచింగ్, శిక్షణా సదుపాయాలు, ప్రాక్టీస్ మ్యాచ్లు, టాలెంట్ ఐడెంటిఫికేషన్ అవకాశాలను అందిస్తూ వారి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఇది కేవలం ఒక సీజన్ కే పరిమితం కాని, రాబోయే ఐదేళ్లపాటు కొనసాగనున్న దీర్ఘకాలిక కార్యక్రమం అని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో టాలెంట్ హంట్లు, ఇంటర్ అకాడమీ టోర్నమెంట్ల నిర్వహణపై కోచ్లు, విద్యార్థులు చేసిన సూచనలను స్వాగతిస్తూ వాటిని అమలు




చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.అనురాగ్ నల్గొండ నైట్స్ హెడ్ కోచ్ డి.బి. రవితేజ యువ ఆటగాళ్లతో ప్రత్యేకంగా మమేకమై ఫిట్నెస్, నైపుణ్యాల అభివృద్ధి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, ఆటలో నిరంతర మెరుగుదల వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫిట్నెస్కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఆటగాళ్లను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జట్టు అసిస్టెంట్ కోచ్ రోనాల్డ్ రోడ్రిగ్స్, ఫిజియో, ట్రైనర్, మేనేజర్, మెంటర్ తదితర సపోర్ట్ స్టాఫ్ను పరిచయం చేశారు. అనంతరం అనురాగ్ నల్గొండ నైట్స్ అధికారిక జెర్సీని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం ద్వారా అనురాగ్ యూనివర్సిటీ మరియు ప్రాంతీయ క్రికెట్ వర్గాల మధ్య బలమైన భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టబడింది. యువ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ ప్రాంతీయ క్రికెట్ అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలకంగా నిలవనుంది.

## ఆడబిడ్డ ఇంటి మహాలక్ష్మి.. వారి భవిష్యత్తుకు అండగా ఉంటాను -- చిలువేరు సమ్మయ్య గౌడ్



లోకల్ గైడ్ జిల్లా ప్రతినిధి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఆడబిడ్డలు భారమేమీ కాదు.. భవిష్యత్తుకు బంగారు బాటలు --- గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ఉప్పరపల్లి గ్రామం నాలుగో వార్డ్ మెంబర్ మంద ప్రవీణ్ ఉ శ్రావణి దంపతులకు మహబూబాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రెండవ కాన్పులో ఆడబిడ్డ జన్మించిన సందర్భంగా ప్రముఖ సామాజిక సేవకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆసుపత్రికి వెళ్లి తల్లిబిడ్డలను పరామర్శించారు.ఈ సందర్భంగా తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకుని, ఇద్దరూ క్షేమంగా ఉండటంపై ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆడపిల్ల పుట్టడం కుటుంబానికి అదృష్టమనిఅన్నారు.ఇప్పటికే మంద ప్రవీణ్ దంపతులకు మొదటి కాన్పులో లికవల ఆడపిల్లలు, సుభిక్ష, ఆద్య ఉండగా, రెండో సంతానంగా కూడా ఆడబిడ్డ జన్మించడంతో కుటుంబ సభ్యులు కొంత అసంతృప్తికి గురైనట్లు తెలుసుకున్న సమ్మయ్య గౌడ్ లివారికి ధైర్యం చెప్పారు. ఆడపిల్లలు లిభారంగా కాకుండా కుటుంబానికి వరమని, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ కుటుంబాలకు, సమాజానికి గర్వకారణంగా నిలుస్తున్నారని వివరించారు."ఆడబిడ్డ అంటే మహాలక్ష్మి స్వరూపం. ఆడపిల్లలు ఉన్న ఇల్లు ఆనందాలతో, ప్రేమతో నిండి ఉంటుంది. లిభవిష్యత్తులో మీ పిల్లల చదువు, అభివృద్ధి కోసం అవసరమైతే నేను కూడా అండగా ఉంటాను. వారి విద్యా బాధ్యతను సైతం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను" అని సమ్మయ్య గౌడ్ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.పరామర్శలో భాగంగా తల్లికి, కుటుంబ సభ్యులకు పండ్లు అందజేసారు, సమ్మయ్య గౌడ్ చూపిన లిఆప్యాయత, ప్రోత్సాహం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడపిల్లలను ప్రోత్సహించడం, వారికి నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆడబిడ్డలను గౌరవించే సమాజమే అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,ఎమ్మార్పీఎస్ నాయకులు,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన

-తెలంగాణ ఇకత్ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అద్భుత వేదిక







సైబరాబాద్, జూన్ 5 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శనను హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హాల్-4లో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనలో సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ అవార్డు గ్రహీతల హస్తకళాఖండాలు, సహజ రంగుల తయారీ విధానాలు, ఇకత్ నేయకళ ప్రత్యేకతలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆధునిక ఏఐ ఎక్స్‌పీరియన్స్ బూత్, ఇకత్ తయారీ ప్రక్రియను వివరిస్తున్న విజువల్ గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. 100కు పైగా స్టాళ్లలో పోచంపల్లి చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు, గృహాలంకరణ, జీవనశైలి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో పోచంపల్లి గ్రామ సందర్శనకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను కూడా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రజలు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన జూన్ 7, 2026 వరకు కొనసాగనుంది. తెలంగాణ చేనేత వారసత్వాన్ని తెలుసుకోవడానికి, ప్రోత్సహించడానికి ఇది ఒక అరుదైన అవకాశంగా నిలవనుంది.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రపరచిన గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .జూన్ 5. (లోకల్ గైడ్) ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అఖిల పక్ష ప్రతినిధులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయా ఆవరణలో ఉన్న గోదాంకు ఆయన అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆయా పార్టీల రాజకీయ ప్రతినిధులతో కలిసి వారి ఎదురుగా గోదామును తెరిపించి గోదాంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు,వి వి ఫ్యాట్ లను పరిశీలించడమే కాక వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రతి మూడు నెలలకు



ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే గోదాములో ఉన్న ఈవీఎంలు, వివి ప్యాడ్ లను పరిశీలించడంలో భాగంగా ఈ తనిఖీ చేసినట్లు ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్, టిఆర్ఎస్ నుండి పిచ్చయ్య, సిపిఐ ఎం నుండి నర్సిరెడ్డి, టిడిపి నుండి ఏ .రవి, ఎంసీపీ నుండి ఎండి రఫీ, బిఎస్ పి నుండి యాదగిరి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

## కొట్టుకుంటే ఒక్కరే గెలుస్తారు.. రాజీ పడితే ఇద్దరు గెలుస్తారు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




నారాయణపేట జూన్ 5:వివాదాలను పెంచుకుంటూ పోతే అవి జీవితకాలం కొనసాగుతాయని, పరస్పర అవగాహనతో రాజీకి వస్తే వెంటనే పరిష్కారమ వుతాయని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 20వ తేదీ వరకు నారాయణపేట, కోస్గి, మక్తల్ కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ పడదగిన కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పోషణ కేసులు, వైవాహిక వివాదాలు, రోడ్డు ప్రమాద పరిహార కేసులు, చిన్నపాటి దొంగతనాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ బకాయిలు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని, న్యాయస్థానం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు మరియు పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జాతీయ లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.

## దుబ్బాకలో కాంగ్రెస్ బూత్ స్థాయి ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ శిబిరం



దుబ్బాక (లోకల్ గైడ్) జూన్ 5: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థ చైర్మన్, ఉమ్మడి మెదక్ జిల్లా శిక్షణ ఇంచార్జి నగరి ప్రీతం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ శిబిరంలో ఓటరు జాబితాల పరిశీలన, సవరణ ప్రక్రియ, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక శిక్షకులు మార్గనిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు తమ సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించి 2002, 2025 సంవత్సరాల ఓటరు జాబితాలను సేకరించి వాటి ప్రతులతో హాజరుకావాలని సూచించారు.ఈ కార్యక్రమం జూన్ 8న సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దుబ్బాకలోని సీఎస్ఆర్ శిబిర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని 253 బూత్‌లకు చెందిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు తప్పనిసరిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెరుకు శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## వ్యవసాయంలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి -- జిల్లా కలెక్టర్ కె. హైమావతి




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) జూన్ 5: జిల్లాలో వ్యవసాయ శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరం నుంచి వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏఓలు, ఏఈఓలతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు నమోదు ప్రక్రియను రోజువారీ లక్ష్యాలతో పూర్తి చేయాలని ఏఈఓలను ఆదేశించారు. రైతు నమోదు ప్రక్రియను ఏఓలు, ఏడీఏలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతు నమోదు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు రైతులకు సకాలంలో అందే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రతి వ్యవసాయ అధికారి పరిధిలోని



విత్తన పంపిణీ కేంద్రాల్లో కనీసం 50 శాతం సన్న వడ్ల విత్తనాల విక్రయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సభలు, రైతు సమావేశాల ద్వారా సన్న వడ్ల సాగుపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి సీజన్‌లో వరి పంటనే సాగు చేయడం వల్ల భూమి సారం తగ్గిపోతుందని పేర్కొన్న కలెక్టర్, రైతులు పంటల మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. వాణిజ్య పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. దీంతో రైతులకు అధిక లాభాలు రావడంతో పాటు భూమి సారవంతంగా ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలి ఎంపి డి కే అరుణ




నారాయణపేట జూన్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని పాలమూరు ఎంపీ డి కే అరుణ కార్యకర్తల కు పిలుపునిచ్చారు.నారాయణపేట జిల్లా ద్వారక స్కూల్ లో శుక్రవారం జరిగిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ సమావేశంలో కార్యకర్తలకు, పార్టీ నాయకులకు తెలంగాణ లో బీజేపీ అధికారంలోకి తీసుకువ చ్చేందుకు శక్తి వంచన లేకుండా పని చేయాలని దిశ నిర్దేశం చేశారు. కార్యకర్తల కఠోర దీక్ష పట్టుదల, మోదీ నాయకత్వం పై విశ్వాసంతో పశ్చిమ బెంగాల్ లోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పెద్ద కష్టమైన పని కాదని, సమిష్టి కృషితో, అందరం కలసి కట్టుగా లక్ష్యం కోసం ప్రతి కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని,జిల్లా,నియోజకవర్గ, మండల స్థాయిలలో స్థానిక సమస్యల పై పోరాటాలు,దీక్షలు,నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. కార్యకర్తలు చేసే ప్రతి పోరాటంలో తాము భాగస్వా మ్యులు అవుతామని, పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. తెలంగాణ కషాయమయం చేస్తామని సంకల్పం తీసుకొని పని చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించే కార్యకర్తకు తప్పకుండా సముచిత గౌరవం పార్టీలో దక్కుతుంద ని అన్నారు. తెలంగాణ ప్రజలు ఆదరాభిమానాలు చూరగొనలని సూచించారు. పదేళ్లు బి ఆర్ ఎస్ పాలనబిలో, ప్రస్తుతం కాంగ్రెస్ రెండేళ్లలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు పూర్తి కాలేదని విమర్శించారు. భవిష్యత్ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరు అడ్డుకోలేరని విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకు కార్యకర్తలు అందరి కలసి పని చేయాలని సూచించా రు.ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలను చైతన్యపరచి కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానా లు తెలియజేయడంతో పాటురాష్ట్ర ప్రభుత్వ హామీ లు గుర్తు చేస్తూ వైఫల్యాల పై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుండా రాష్ట్రంలో ఏ పథకం లేదని, పాఠశాల లో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలలో పోష కాహారం నుంచి మొదలు పెడితే అన్నింటిలో కేంద్రం నిధులు ఉన్నాయని తెలిపా రు.సీఎం రేవంత్ రెడ్డి గాలి మోటార్లో తిరుగుతూ గాలి మాటలు చెబుతున్నారని, గాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, గాల్లో కలసి పోతుందని ఎంపీ డీకే అరుణ ఎద్దేవ చేశారు. తెలం గాణ అభివృద్ధి పైన అవగా హన, చిత్తశుద్ధి కాంగ్రెస్ కి లేదని విమర్శించారు. పాల మూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ పదేళ్లలో కుర్చీ వేసు కొని పూర్తి చేస్తానని చెప్పి చేయలేదని, కాంగ్రెస్ రెండు న్నర ఏళ్లలో ఏం చేసింది లేదని విమర్శించారు. ఇంది రమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్య కర్తలకు ఇస్తున్నారు తప్ప నిజమైన అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇంది రమ్మ ఇండ్లు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటి సొమ్ము నుంచి ఇవ్వడం లేదని, ప్రజల సొమ్ముతో ఇస్తున్నా రని ప్రతి ఒక్కరు ఎక్కడి కక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నిం చాలని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏ నియోజకవర్గంలో పర్యటిం చిన రోడ్ల గతి తెలుస్తుందని, కనీసం గుంతలు కూడా పూడ్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ మహ బూబ్ నగర్ జిల్లాలో జరుగు తున్న రహదారుల పనులు కేంద్రం ప్రభుత్వం నిధులతో భారత్ మాల, జాతీయ రహదారుల పనులు తప్ప మరేం లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో 90శాతం ఎగ్గొట్టారని, మహి ళలకు మహాలక్ష్మీ చేయూత ప్రతి నెల 2500 రూపాయలు అన్నారు, యువతులకు స్కూటీలు, తులం బంగారం, పెన్షన్ ల పెంపు అన్నారు, ఏది ఇవ్వలేదు. రైతులు, నిరుద్యోగులను, ఉద్యోగు లను, అన్ని వర్గాలను కాంగ్రె స్ మోసం చేసిందని విమ ర్శించారు. రెండున్నర ఏళ్ళు ప్రభుత్వానికి సమయం ఇచ్చాంహామీలు అమలు చేయాలని రోజుకో అంశంతో నిరసనలు చేయాలని పిలు పునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంతన్ పాండు రెడ్డి,పగడకుల శ్రీనివాస్, తిరుపతి రెడ్డి ,లక్ష్మీ శ్యామ్ సుందర్,కొండయ్య, లహుటి శ్రీనివాస్ ,బలరాం రెడ్డి, రఘురామయ్య , ప్రతాప్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి ,బీజేపీ నాయకులు , జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## "మొక్కలు నాటడం కార్యక్రమం కాదు..

### జీవన విధానంగా మార్చుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్"

అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు -- మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపు







సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) జూన్ 5:ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సీపీ సాధన రశ్మీ పెరుమాళ్, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా "చెట్టు విలువ తెలుసా?" అనే అవగాహన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తామని అందరితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రపంచం కుగ్రామంగా మారుతున్న ఈ కాలంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. ఢిల్లీలో కాలుష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు తెలంగాణలో రాకుండా ముఖ్యమంత్రి నాయకత్వంలో ఈవీ పాలసీ అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ప్రతి ఇంటి వద్ద ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో మొక్కల పెంపకాన్ని పోటీగా తీసుకుని ఉత్తమంగా మొక్కలు పెంచిన గ్రామాల సర్పంచ్‌లను అభినందించాలని సూచించారు. గీతా కార్మికులకు రక్షణ కవచాలు అందించడంతో పాటు తాటి, ఈత చెట్ల పెంపకాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, పర్యావరణం దెబ్బతింటే భవిష్యత్తులో ఆక్సిజన్ సిలిండర్లు వెంట తీసుకెళ్లాల్సిన పరిస్థితులు రావచ్చని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని, ప్లాస్టిక్ నిషేధం ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ఈ ఏడాది మెదక్ నుండి ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారి ఇరువైపులా లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని వెల్లడించారు.జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత కోసం కనీసం 33 శాతం పచ్చదనం అవసరమని తెలిపారు. గత ఏడాది జిల్లాలో 22 లక్షల మొక్కలను నాటి సంరక్షించామని, ఈ ఏడాది 17 లక్షల మొక్కలను నాటేందుకు నర్సరీల్లో సిద్ధం చేశామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే కాక ప్రతి పౌరుడిదని పేర్కొన్నారు.కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ప్రాధాన్యతపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: అదనపు కలెక్టర్ రవి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనమహోత్సవం నిర్వహణ




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్05(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ,ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ



పరిరక్షణ, చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో జాప్యంపై ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి



లోకల్ గైడ్' ఖమ్మంయుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశంస్టేషన్ ఆవరణలో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రామసహాయం ఖమ్మం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల తీరుపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఎంపీ.. సుమారు గంటన్నర పాటు స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు.క్షేత్రస్థాయిలో తనిఖీ..ఎస్కలేటర్ ను ఆన్ చేయించి రెండో ప్లాట్‌ఫామ్‌కు చేరుకొని దాని పనితీరును గమనించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లి, నిర్మాణాలకు సంబంధించిన మ్యాప్‌లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..ఆధునికీకరణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రయాణికులకు ఇబ్బందులు రానీయొద్దు.వర్షాకాలం సమీపిస్తుండటంతో అసంపూర్తిగా ఉన్న పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో పలు నూతన అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని...



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్05(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ : వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో చేపట్టనున్న పలు నూతన అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం రోజున ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే




నాయిని మాట్లాడుతూ, ఆఫీసర్స్ క్లబ్‌ను మరింత ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్లబ్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.క్లబ్ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం సభ్యులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాంప్ కార్యాలయం సత్తుపల్లి సత్తుపల్లి మండలం 22 మంది సిఎంర్ఫ్



సత్తుపల్లి:లోకల్ గైడ్ : క్యాంప్ కార్యాలయం సత్తుపల్లి -సత్తుపల్లి మండలం 22 మంది సిఎంర్ఫ్ లబ్ధిదారులకు 8,51,500/- రూపాయలు విలువ గల చెక్కులు మరియు వేంసూరు మండలం 31 మంది సిఎంర్ఫ్ లబ్ధిదారులకు 9,18,500/- రూపాయలు విలువ గల చెక్కులను అందించిన.... సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ...ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, సత్తుపల్లి,వేంసూరు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై సిద్దిపేట ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

28 మందికి రూ.3 లక్షల జరిమానా -- లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసిన 18 మందికి రూ.90 వేల ఫైన్ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : ట్రాఫిక్ సీఐ ముత్యం రాజు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) జూన్ 5 :సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మంది వ్యక్తులు పట్టుబడగా, కోర్టు వారికి మొత్తం రూ.3 లక్షల జరిమానా విధించింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 18 మందికి రూ.90 వేల జరిమానా విధించారు.సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. ముత్యం రాజు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 28 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో వారు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి మొత్తం రూ.3 లక్షల జరిమానా విధించారు.అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 18 మందిపై కేసులు నమోదు చేసి, ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.90 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ముత్యం రాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర వాహనదారుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిపై కోర్టు ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ.5 వేల జరిమానా విధించబడుతుందని స్పష్టం చేశారు.

# టీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శిగా జిల్లా యాదయ్య ఏకగ్రీవ ఎన్నిక.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. జూన్ 5.(లోకల్ గైడ్)నకిరేకల్‌లోని వినాయక బ్యాంక్వెట్ హాలులో నిర్వహించిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయు) జిల్లా మహాసభలో నూతన జిల్లా సహాయ కార్యదర్శిగా జిల్లా యాదయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది.ఈ సందర్భంగా జిల్లా యాదయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.టీయూడబ్ల్యూజే (ఐజేయు) సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయిలో విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేసిన ఆయన,జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు అందిస్తామని ప్రభుత్వాలు పలుమార్లు హామీలు ఇచ్చినా అమలులో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం సంఘం తరపున నిరంతరం కృషి చేస్తానని జిల్లా యాదయ్య స్పష్టం చేశారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ....

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఇంపాక్ట్ మరియు తొలిఅడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందన సభ ఘనంగా నిర్వహించారు. అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ సభలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన లక్ష్యంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. విద్యార్థుల విజయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమనిఅన్నారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిద్దేందుకు కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు.అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పర్సా వెంకట్, సీనియర్ నాయకులు బానోత్ భీముడు, ఇంపాక్ట్, తొలి అడుగు ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశం...

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

:అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలనే లక్ష్యంతో దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామంలోని చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్‌లో సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్లు, గ్రామ పంచాయతీ కోఆర్డినేటర్లు, సోషల్ మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ ౘ ట్రాన్స్పోర్ట్ అథారిటీ కమిటీ మెంబర్ పెట్టం నవీన్, సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీ ౘ కర్మాన్ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, మహబూబాబాద్ కౌన్సిలర్ అంబాల శివకుమార్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ౘ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ వీరాపురం రామలక్ష్మణ్ హాజరై పార్టీ బలోపేతానికి సూచనలు చేశారు.ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని రోజువారీ స్థానిక అంశాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. పీసీ, ఏఐసీసీ కార్యక్రమాలు, స్థానిక నాయకుల పర్యటనలు, ప్రజా సమావేశాలు, పార్టీ కార్యకలాపాలను రీల్స్, వీడియోలు, గ్రాఫిక్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలతో కూడిన కంటెంట్‌గా రూపొందించి ప్రచారం

# సమాజ సేవకునికి రాష్ట్రస్థాయి గుర్తింపు

అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జంబోజు సమ్మయ్య చారి నియామకం

మంథని పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ వేదిక నాయకుడు జంబోజు సమ్మయ్య చారి అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంథని ప్రాంత విశ్వకర్మ సంఘాల నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా సమాజ సేవలో విశేషంగా కృషి చేస్తున్న జంబోజు సమ్మయ్య చారికి రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించడం మంథని ప్రాంతానికి గర్వకారణమని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జంబోజు సమ్మయ్య చారి మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ బంధువుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో పని చేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా విశ్వకర్మ సమాజ ఐక్యత, అభివృద్ధి, సామాజిక పురోగతికి తన వంతు సేవలను అందిస్తానని పేర్కొన్నారు. సమ్మయ్య చారి అందరితో కలుపుగోలుగా ఉంటూ సమాజ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే వ్యక్తి అని సంఘ సభ్యులు కొనియాడారు. జంబోజు సమ్మయ్య చారి నియామకం పట్ల విశ్వకర్మ సంఘాల నాయకులు, సభ్యులు అభినందనలు తెలిపారు.

# జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అశ్వారావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపిక...

):కేంద్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు.పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసిన ఆకుల వీరేన్ గంగా దుర్గ, బొల్లి మణిచందర్ రాజు జాతీయస్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ శుక్రవారం తుది జాబితాను విడుదల చేసింది.ఈ ఇద్దరు విద్యార్థులకు 9వ తరగతి నుంచి పీజీ స్థాయి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంవత్సరానికి రూ.12 వేల ఉపకార వేతనం లభించనుంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, పాఠశాల ఉపాధ్యాయులు ఇద్దరు విద్యార్థులను అభినందించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

# జర్నలిస్టు అక్రిడేషన్ కార్డుల పంపిణి వేగవంతం చేయండి

టి.డబ్ల్యూ.జే.ఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటి

హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయతీ నిర్ధిష్ట అమలుకు డిమాండ్

)కాప్రా : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టి.డబ్ల్యూ.జే.ఎఫ్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటి సమావేశం శుక్రవారం కాప్రా సర్కిల్ కమలానగర్ కమ్యూనిటీ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్ష్యుడు మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి హరి ప్రసాద్ హాజయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అక్రిడేషన్ల పంపిణి కార్యక్రమం వేగవంతం చేయాలని హెల్త్ కార్డులు, జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయతీలకు సంబంధించి ప్రభుత్వ ఉతర్వులు అమలు చేయాలని కోరారు. దీర్ఘకాల ఆకాంక్షగా ఉన్న జర్నలిస్టుల ఇంటి స్థలాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఈ సమావేశంలో ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో వందలాది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులు కుటుంబాలకు ఫెడరేషన్ అన్ని విధాల అండగా ఉంటదని జిల్లా కార్యదర్శి బానోత్ రవి నాయక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్ష్యులు గుమ్మడి రోజారాణి, సింగం రాజు, అంబాల.విష్ణు, ఇంద్రపాలా. సత్యనారయణ,ఉస్సేన్, సహదేవ్, దుర్గాప్రసాద్ మెహన్ రెడ్డి, రజనికాంత్, దావత్.అరుణ్ కుమార్, చిక్కుడు.నరసింహ, తదితరులు ఉన్నారు.

# ప్రైమరీ పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మంథని మండలంలోని ఎంపీపీ ఎస్ గౌతమి నగర్ పాఠశాలలో ఇటీవల మంజూరైన ప్రీ ప్రైమరీ తరగతుల కోసం ఆయాలు మరియు ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి దాసరి లక్ష్మి తెలిపారు. ఈ పోస్టులకు పది నెలలపాటు గౌరవ వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత, ఆయా పోస్టుకు ఏడవ తరగతి విద్యార్హతగా నిర్ణయించినట్లు తెలిపారు. 18 నుండి 44 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు వయో పరిమితిలో సడలింపు ఉంటుందని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీలోగా జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్)-మంథని పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

# మహిళా సంఘాలలో పారదర్శకతకు 'మన డబ్బులు మన లెక్కలు'

నేటి నుండి నార్పల మండలంలో ప్రత్యేక అవగాహన ర్యాలీలు

మొబైల్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఆర్థిక లావాదేవీల తనిఖీ

స్వయం సహాయక సంఘాల మహిళల్లో ఆర్థిక పారదర్శకత,జవాబుదారీతనం పెంచే లక్ష్యంతో నార్పల మండలంలో జూన్ 06 నుంచి జూన్ 29 వరకు “మన డబ్బులు మన లెక్కలు” ప్రత్యేక కార్యక్రమాలు,అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నారు.మండలంలోని అన్ని గ్రామ సంఘాల పరిధిలో సభ్యుల పొదుపు,రుణాలు,తిరిగి చెల్లింపుల లావాదేవీలను మొబైల్ బుక్ కీపింగ్‌తో పాటు కొత్తగా తీసుకొచ్చిన “మన డబ్బులు మన లెక్కలు” యాప్ ద్వారా నమోదు చేయనున్నారు.ఈ యాప్ ద్వారా ప్రతి సభ్యురాలు సంఘం లావాదేవీలను ఎప్పటికప్పుడు తమ మొబైల్‌లోనే తెలుసుకోవచ్చు.ఈ కార్యక్రమ ప్రణాళికా సమావేశానికి సింగనమల నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ డిఆర్డిఎ,ఐబి,రాజ్యలక్ష్మి,ఏపీఎం మరియు డిప్యూటీ ఎంపీడీఓ సుజాత,ఎస్బీఐ,ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు,మండల సమాఖ్య సిబ్బంది హాజరయ్యారు.ప్రతి మహిళా సభ్యురాలు తమ మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.సొంత ఫోన్ లేని వారికి కుటుంబ సభ్యుల మొబైల్ ద్వారా డౌన్‌లోడ్ చేయించే బాధ్యతను వీఓఏలు,ఈ-నారీలు తీసుకుంటారు.అన్ని సంఘాల “మన డబ్బులు మన లెక్కలు” పీడీఎఫ్ ప్రింట్లు సిద్ధం చేసి, యాప్ వినియోగం మరియు లావాదేవీల తనిఖీ విధానంపై ఈ-నారీలు సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు.మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో ఏ రోజు,ఏ ప్రదేశంలో సమావేశాలు జరుగుతాయో ఈ-నారీలు ముందే ప్రణాళిక వేసుకుని సభ్యులకు సమాచారం అందిస్తారు.కార్యక్రమ విజయవంతం కోసం గ్రామాల వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించేందుకు ప్రత్యేక నినాదాలు, ప్లేకార్డులను సిద్ధం చేస్తున్నారు.ఈ వినూత్న యాప్ ద్వారా పొదుపు సంఘాల్లో డిజిటల్ అక్షరాస్యత పెరగడంతో పాటు ఆర్థిక లావాదేవీల్లో మరింత స్పష్టత వస్తుందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

# బి.పప్పూరులో 'అనంత అరణ్య' పచ్చదనం.. గురుకుల పాఠశాలలో గుంతల తీత పనులు షురూ

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్పల మండలం బీ.పప్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గురుకుల పాఠశాల ఆవరణంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణకు అడుగు పడింది.'అనంత అరణ్య ప్లాంటేషన్' కార్యక్రమంలో భాగంగా ఇక్కడ మొత్తం 1,600 మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇందులో భాగంగా నేడు మొక్కలు నాటేందుకు వీలుగా గుంతలు తీసే కార్యక్రమాన్ని అధికారులు,ప్రజాప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో మమత దేవి,ఏపీడీ చెన్నకేశవులు,వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్ళయప్ప విచ్చేశారు.వారు చేతుల మీదుగా గుంతలు తీసే పనులను ప్రారంభించి,పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పిలుపునిచ్చారు.భవిష్యత్తు తరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించడమే ఈ అనంత అరణ్య కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ రమేష్ రామారావు,ఈసీ సంగీత,ఉపాధి హామీ పథకం సిబ్బంది,హార్ట్‌ఫుల్‌నెస్ ఎన్జీవో సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు,సచివాలయ సిబ్బంది మరియు స్థానిక రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణాన్ని పచ్చదనంతో నింపేందుకు అధికారులు తీసుకుంటున్న చొరవను స్థానికులు అభినందించారు.

# ఉపాధి కూలీల సమస్యలపై సమరభేరి రెండు పూటల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్

: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనంతపూర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నార్పల మండలంలోని కేశేపల్లి,నడిమిదొడ్డి గ్రామాలలో ఉపాధి హామీ కూలీల సమస్యలపై విస్తృత పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకులు నేరుగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం కూలీల హక్కుల కోసం,ఉపాధి చట్టం పరిరక్షణ కోసం సంఘం నాయకులు ప్రభుత్వానికి పలు డిమాండ్లను ఐక్యం చేశారు.ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగిస్తూ,రాంజీ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు.కూలీలకు తీవ్ర ఇబ్బందిగా మారిన రెండు పూటల మస్టర్ వేసే విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.సాంకేతిక ఇబ్బందులతో కూలీల పొట్ట గొడుతున్న ఫేస్ రికగ్నిషన్ యాప్ (ఫేస్ యాప్) విధానాన్ని పూర్తిగా తీసివేయాలి.వేతనం,పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ కూలి ?700 అందించాలనీ,అలాగే ఏడాదికి 200 రోజుల పని కల్పించాలన్నారు.ఈ పర్యటన మరియు నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.ప్రభాకర్,ఆర్.రామాంజనేయులు,నాగన్న, వై. ఎర్రి నాగప్ప తదితరులు పాల్గొని కూలీల పోరాటానికి

లోకల్ గైడ్ తెలంగాణ
www.localguidenews.com
శనివారం - 06 -జూన్ - 2026

# ఏఐపై అంబానీ ఫోకస్

## రిలయన్స్ ముసాయిదా మేనిఫెస్టో ఆవిష్కరణ
## ఉద్యోగుల ఉత్పాదకత పది రెట్లు పెంపు లక్ష్యం
## సమాజ శ్రేయస్సుపైనా ద ృష్టి

న్యూఢిల్లీ: ఆయిల్ నుంచి రిటైల్, టెలికం వరకు వివిధ రంగాల్లో విస్త ృతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ రాబోయే రోజుల్లో అధునాతన తయారీ సామర్థ్యాలతో ఏఐ ఆధారిత డీప్ టెక్ దిగ్గజంగా రూపాంతరం చెందాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆరు లక్షలకు పైగా ఉన్న ఉద్యోగుల ఉత్పాదకతను పది రెట్లు పెంచుకోవాలని, దేశ ఆర్థిక వ్యవస్థ, సమాజంపై పది రెట్లు సానుకూల ప్రభావం చూపేలా వ్యవహరించాలని నిర్దేశించుకుంది. ఈ లక్ష్య సాధనకు తోడ్పడేలా, కంపెనీ ఏఐ మేనిఫెస్టోను రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మంగళవారం ఆవిష్కరించారు. 'మానవ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన సాంకేతిక పురోగతి'గా క ృత్రిమ మేధను ఈ సందరరేగా అభివరి?ంచారు. దేశీయంగా డిజిటల్ పరివర్తనకు సారథ్యం వహించిన విధంగానే ఏఐ విప్లవానికి కూడా నేత ృత్వం వహించాలని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. భద్రత, విశ్వసనీయత, జవాబుదారీతనం హామీతో ప్రతి భారతీయునికి అతి తక్కువ వ్యయాలతో ఏఐని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 'అధునాతన తయారీ సామర్థ్యాలతో ఏఐ ఆధారిత డీప్ టెక్ కంపెనీగా మారే దిశగా రిలయన్స్ ముందుకు సాగుతోంది. రిలయన్స్ ఏఐ ముసాయిదా మేనిఫెస్టోను సిద్ధం చేసుకున్నాం. కార్యాచరణ ప్రణాళిక అమలుకు ఇది గైడ్‌గా పనిచేస్తుంది' అని అంబానీ పేర్కొన్నారు.

### ఐడియాలకు ఆహ్వానం..

టెలికం, రిటైల్, ఎనర్జీ, మెటీరియల్స్, లైఫ్ సైన్సెస్, ఆర్థిక సేవలు, మీడియా తదితర వ్యాపార విభాగాలతో పాటు దాత ృత్వ కార్యకలాపాలవ్యాప్తంగా ఏఐని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఉపయోగపడే ఐడియాలు ఇవ్వాలని ఉద్యోగులను అంబానీ కోరారు. జనవరి 10 నుంచి 26 వరకు కొత్త ఆలోచనలను తెలియజేయాలని సూచించారు. ఏఐ హార్డ్‌వేర్, రోబోటిక్స్‌లాంటి వాటితో సమర్థత, సుస్థిరత, సాంకేతిక స్వావలంబనను సాధించేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

### మేనిఫెస్టో ఇలా..

మేనిఫెస్టో మొదటి భాగంలో అంతర్గత పరివర్తన, ఏఐని టెక్నాలజీ ప్రాజెక్టుగా కాకుండా కొత్త పని విధానంగా పరిగణించే అంశాలను చేర్చారు. రెండో భాగంలో దేశీయంగా ఏఐ పరివర్తనకు తోడ్పడే విజన్‌ని పొందుపర్చారు. కొనుగోళ్ల నుంచి చెల్లింపుల వరకు, నియామకాల నుంచి రిటైర్మెంట్ల వరకు, ప్లాంటు నుంచి పోర్టు వరకు కీలకమైన విధుల్లో మానవ ప్రమేయాన్ని తగ్గించే విధంగా, నిర?యాల ప్రక్రియకు తోడ్పడేలా సంస్థవ్యాప్తంగా ఏఐతో పని విధానాల్లో మార్పులను తొలి భాగంలో ప్రస్తావించారు. డేటా, సమన్వయం, భద్రత, వివిధ వ్యాపారాలవ్యాప్తంగా పర్యవేక్షణ మొదలైన వాటన్నింటికీ ప్రమాణాలు నిర్దేశించేలా పన్నెండు అంచెల డిజిటల్ ఫంక్షనల్ కోర్ (డీఎఫ్‌సీ) ఉంటుంది. తమ వ్యాపారాలు, దాత ృత్వ కార్యకలాపాల ద్వారా ఏఐ ఆధారిత భారతదేశ పరివర్తనకి తోడ్పడాలనే రిలయన్స్ ఆకాంక్షలను ప్రతిఫలించేలా రెండో భాగం ఉంటుంది. ఆరోగ్య సంరక్షణ, విద్య, సమ్మిళిత ఆర్థిక సర్వీసులు మొదలైన వాటిల్లో ఏఐ దన్నుతో కొత్త సొల్యూషన్స్, కొత్త మెటీరియల్స్‌ను కనుగొనేందుకు అపార అవకాశాలు ఉన్నాయని అంబానీ చెప్పారు




# సోషల్ మీడియా వినియోగం.. ఇండియన్ ఆర్మీ కొత్త రూల్స్!

భారత సైన్యం.. తమ సిబ్బందికి సోషల్ మీడియా వినియోగంపై ఉన్న నిబంధనలను పాక్షికంగా సవరించింది. గతంలో ఉన్న కఠినమైన నిషేధాలను సడలిస్తూ, ఎంపిక చేసిన కొన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో నిష్క్రియాత్మక భాగస్వామ్యాన్ని అనుమతిస్తూ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ కొత్త ఉత్తర్వులను జారీ చేసింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఇంటెలిజెన్స్ (డీజీఎంఐ) రూపొందించిన ఈ నూతన మార్గదర్శకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది.

### ఏమిటీ నిష్క్రియాత్మక భాగస్వామ్యం?

కొత్త విధానం ప్రకారం.. సైనిక సిబ్బంది ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (గతంలో ట్విట్టర్) వంటి ప్లాట్‌ఫామ్‌లను సమాచారం తెలుసుకోవడానికి లేదా కంటెంట్‌ను చూడటానికి మాత్రమే ఉపయోగించవచ్చు. అయితే.. ఈ ప్లాట్‌ఫామ్‌లలో ఎటువంటి యాక్టివ్ ఎంగేజ్‌మెంట్ ఉండకూడదు. అంటే..

పోస్ట్‌లు పెట్టడం, ఫొటోలు అప్‌లోడ్ చేయడం చేయకూడదు.

### ఇతరుల పోస్టులపై వ్యాఖ్యానించడం నిషేధం.

లైక్ చేయడం, షేర్ చేయడం లేదా పోస్టులకు రియాక్ట్ అవ్వడం వంటివి చేయకూడదు.

డైరెక్ట్ మెసేజ్‌లు పంపడంపై కూడా నిషేధం కొనసాగుతుంది.

### ఇన్‌స్టాగ్రామ్‌కు అధికారిక అనుమతి

ఈ అప్‌డేట్‌లో భాగంగా ఇన్‌స్టాగ్రామ్‌ను అధికారికంగా.. 'పరిమిత వినియోగ' సోషల్ మీడియా జాబితాలో చేర్చారు. కేవలం నిఘా, సమాచార సేకరణ ప్రయోజనాల కోసం మాత్రమే దీన్ని వాడాలని, వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకోవడానికి వీల్లేదని ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి.

### కమ్యూనికేషన్, ప్రొఫెషనల్ ప్లాట్‌ఫామ్‌లు

వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్కైప్ యాప్‌లను సాధారణ స్థాయి సమాచార మార్పిడికి ఉపయోగించవచ్చు. అయితే, గ్రహీత ఎవరో కచ్చితంగా తెలిసినప్పుడు మాత్రమే కమ్యూనికేట్ చేయాలి. దీనికి పూర్తి బాధ్యత సదరు సిబ్బందిదే. లింక్డ్ఇన్ వ ృత్తిపరమైన అవసరాల కోసం, అంటే రెజ్యూమ్‌లు అప్‌లోడ్ చేయడం లేదా ఉద్యోగ సమాచారం కోరడం వంటి పనులకు మాత్రమే దీన్ని అనుమతిస్తారు. యూట్యూబ్, కోరా వీటిని కేవలం జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి మాత్రమే వాడాలి.





### కఠినమైన హెచ్చరికలు

సౌలభ్యాలను కల్పిస్తూనే సైన్యం కొన్ని అంశాలపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. క్రాక్డ్ సాఫ్ట్‌వేర్‌లు, ఉచిత మూవీ పోర్టల్స్, టొరెంట్, వెబ్ ప్రాక్సీలు, వీపీఎన్ సర్వీలకు వాడకూడదు. చాట్ రూమ్‌లు, ఫైల్ షేరింగ్ ప్లాట్‌ఫామ్‌ల జోలికి వెళ్లవద్దని సూచించింది. క్లౌడ్ ఆధారిత డేటా సేవల వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది.

### 2020లో 89 యాప్‌లపై నిషేధం

జులై 2020లో చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు, సైబర్ భద్రతా ముప్పుల నేపథ్యంలో.. భారత సైన్యం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సహా 89 యాప్‌లను తక్షణమే తొలగించాలని తన సిబ్బందిని ఆదేశించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం నిషేధించిన 59 చైనా యాప్‌లు కూడా ఉన్నాయి. తాజా సవరణలు సైనిక భద్రతను కాపాడుతూనే మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా సిబ్బందికి కొంత వెసులుబాటు కల్పించే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి.

# ఆనె పరిగెతో ఇన్ని లాభాలా!



ఈ అడవి పండుకు ఇంగ్లీష్ పేరు: వైల్డ్ జుజుబె. తెలుగు పేర్లు: గొట్టె తీగ, పిండి పరిఘము, ఆనె పరిగె, తెల్ల పరిగె. అస్సామీస్: బిధావో భోగారి, బోన్ బాగరి, బోన్ బొగోరి, డిందవో బోగన్. ఒరియా: తినకోలి. కన్నడ: కట్టిలందల్, బేలహదు, బిళీముళ్ళిహను, కనిక, కొట్ట ముల్లుహణ్ణు.

గుజరాతీ: తోరన్. తమిళం: కట్టిలండల్, తోతరి, తోటన. మలయాళం: జాలి, కొట్టవుుళ్ళు, తొడలి, తుటరి, మలంతుటలీ. మరాఠీ: తురన్, తోరణ. హిందీ: చూర్ణ, సూరన్. సంస్కృతం: ఘంటా అని పిలుస్తారు. ప్రాంతాలను బట్టి ఉచ్ఛారణలో కొంత తేడా ఉంటుంది. ఇది జిట్ట రేగు కుటుంబానికి చెందినది. దీనికి కూడా ముండ్లు కురచగా జంటగా కానీ ఒంటరిగా కానీ ఉంటాయి. తెల్ల పరిగె దాదాపు 5--7 మీటర్లు ఎత్తు వరకు పెరుగుతుంది. మానుకు దగ్గరలో వేరే చెట్టు ఉంటే దాని సహాయంతో తీగలా కూడా పెరుగుతుంది. రేగు చెట్టులా ఇది కూడా ఆకులు రాల్చుతుంది. పండ్లు తెల్లగా ఉండి, అడుగు భాగాన కొద్ది నాటి కాషాయం రంగు ఉంటుంది. పండ్లు తెల్లగా ఉన్నందున దీనికి చెంచులు 'తెల్ల పరిగె' లేక ఆనె పరిగె అని పిలుస్తారు. థాయిలాండ్‌లో దీని ఉనికి ఎక్కువగా ఉంది. ఇండియా, చైనా, మయన్మార్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, బాంగ్లాదేశ్ తదితర దేశాల్లోని ఉష్ణ మండల అడవుల్లో పెరుగుతుంటాయి. భారతదేశంలో మాత్రం ఉత్తరప్రదేశ్, బీహార్, వెస్ట్ బెంగాల్, అస్సాం, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్--నికోబార్ దీవుల్లో ఈ చెట్లు ఉన్నాయి. తెలంగాణలోని నల్లమల అడవులలో అక్కడక్కడా ఉన్నాయి. ముఖ్యంగా మల్లాపూర్, కుడిచింత బయలు మొదలగు ప్రాంతాలలో గమనించవచ్చు. అక్కడి చెంచుల అభిప్రాయం మేరకు ఈ చెట్లు చాలా వరకు కనుమరుగవుతున్నాయి. వీటిని అభివృద్ధి పరిచే అవసరం ఎంతైనా ఉంది.

### ఆనె పరిగె పండు ఉపయోగాలు

పండ్లు తెలుపు రంగులో ఆకర్షణీయంగా ఉంటాయి. పండులో గుజ్జు కొంత వరకు పిండిగా ఉండి రుచికరంగా ఉండటం వలన చెంచులు ఈ పండ్లను బాగా ఇష్ట పడుతారు. జీవాలు వీటి ఆకులను బాగా ఇష్టపడతాయి. పంటపొలం చుట్టూ తెల్లపరిగె కొమ్మలను కంచెగా వేసుకొని పశువులు ఇతర జంతువుల నుండి పంటను కాపాడుకోవచ్చు. రాలిన పండ్లను ఉడుతలు, కుందేళ్లు ఇతర జంతువులు ఇష్టంగా తింటాయని చెంచులు అన్నారు.

### తెల్ల పరిగెను

చెంచులు, ఇతరులు అనేక రోగాలను నయం చేయటానికి వాడుతారు. ముఖ్యంగా విరేచనాలు, అల్సర్లు, చర్మ వ్యాధులు, దగ్గు, రక్తపోటు మొదలైన వాటికి వాడతారు. ఈ పండులో ఉన్న ఔషధ, పోషక గుణాలు ఉన్నందు వల్ల పోషక లోపాలను కొంతవరకు అరికట్టవచ్చు. ఆ పండ్లలో కూడా ఇతర పంటల్లో మాదిరిగానే చక్కెర, కొవ్వు, పీచు మొదలైన పదార్థాలు ఉంటాయి. పోషకాల విశ్లేషణ ఈ పట్టికలో పొందుపరిచాం...

పండ్లు: మార్చ్ - ఏప్రిల్ నెలలోకాస్తాయి. 5-7 మీటర్ల ఎత్తు పెరుగుతుంది

# మొక్కజొన్న చొప్పతో జెట్ ఇంధనం!

మొక్కజొన్న కంకుల్ని కోసిన తర్వాత మిగిలే ఎండు చొప్పతో జెట్ విమానాలను నడిపే ఖరీదైన ఇంధనాన్ని రూపొందించడం ద్వారా ఖర్చు తగ్గించుకోవటంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. పశ్చిమాసియా యుద్ధం ?ర?రంభమైన తర్వాత విమానయాన ఇంధనం ధర రెట్టింపైంది. విమానయాన సంస్థలు పెట్రోలియంకు ప్రత్యామ్నాయాలను కనుగొని, తమ ఉద్గారాలను తగ్గించుకోవాలని చూస్తున్నాయి. మొక్కజొన్న పంట వ్యర్థాలను ఇంధనంగా మార్చడం దీనికి ఒక గొప్ప ఆరంభం కానుంది. ప్రతి పంట కోత కాలం తర్వాత అమెరికాలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మొక్కజొన్న పొలాలు ఎండిన చొప్ప, ఆకులతో నిండి?ోతాయి. మొక్కజొన్న కంకులను సేకరించిన తర్వాత మిగిలి?ోయే వ్యర్థాలు ఇవి. కొంతమంది రైతులు ఈ చొప్పను జంతువులకు మేతగా వేస్తారు లేదా పంటల మధ్యన ఆచ్ఛాదనగా లేదా సహజ కం?ోస్టు ఎరువుగా తయారు చేసి భూసారాన్ని పెంచటానికి ఉపయోగిస్తారు. కానీ, అమెరికా వంటి దేశాల్లో మొక్కజొన్న వ్యర్థాల్లో చాలా భాగం సరిగ్గా ఉపయోగపడకుండానే మిగిలిపోతోంది. వరల్డ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ) తాజా పరిశోధన ప్రకారం.. విమానయాన రంగంలో ఉద్గారాలను తగ్గించటం అత్యంత క్లిష్టతరమైన పని. అయితే, మొక్కజొన్న వ్యర్థాలను ఈ పని కోసం సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చని తేలింది. మొక్కజొన్న చొప్ప నుంచి జెట్ ఇంధనాన్ని తయారు చేయటం ద్వారా ఈ ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను వాతావరణ మార్పులకు దోహదపడకుండా తీర్చవచ్చు. ఇరాన్‌పై యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి మూసివేతతో ముడి చమురుతో తయారయ్యే సాంప్రదాయ జెట్ ఇంధనం ధర ప్రపంచవ్యాప్తంగా ఇటీవల రెట్టింపు అయ్యింది. కానీ, ప్రపంచ ఉద్గారాల్లో 2.4% కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోలియం జెట్ ఇంధనానికి ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేసే కృషి ఈ యుద్ధానికి ముందే మొదలైంది. విమాన ప్రయాణానికి డిమాండ్ పెరిగేకొద్దీ, 2050 నాటికి ఈ ఇంధన కాలుష్యం మూడు రెట్లు పెరుగుతుందని అంచనా.

### చొప్పతో 10% జెట్ ఇంధనం

మొక్కజొన్న చొప్ప వ్యర్థాలతో జెట్ ఇంధనం తయారీ ప్రక్రియ మనుషులకూ, పర్యావరణానికీ కూడా మేలు చేసే ఒక మెరుగైన ప్రత్యామ్నాయం అని డబ్ల్యూఆర్ఐ పరిశోధనలో తేలింది. నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి పొలాల్లోనే వదిలివేయాల్సిన భాగాన్ని మినహాయించిన తర్వాత, అమెరికాలో ప్రతి సంవత్సరం 9 కోట్ల టన్నుల మొక్కజొన్న చొప్ప అందుబాటులో ఉంటుందని అంచనా. ఇది 300 కోట్ల గ్యాలన్ల నిజమైన సుస్థిర ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి సరిపోతుంది. ఈ మొత్తం అమెరికా వైమానిక ఇంధన కాలుష్యాన్ని 75% తగ్గింపునకు దోహదపడుతుంది. అంతేకాకుండా, అమెరికా జెట్ ఇంధన అవసరతను 10 శాతం వరకూ తీరుస్తుంది. ప్రస్తుతం అమెరికాలో మొక్కజొన్న ఇథనాల్‌ను జెట్ ఇంధనంగా మార్చుతున్నారు. ఈ పనికి స్వస్తి చెప్పటం ద్వారా ఆహార ధాన్యాలను ఇంధనానికి వాడటం మానుకోవచ్చు. దీని వలన కలిగే ప్రయోజనం కేవలం వాతావరణానికి మాత్రమే పరిమితం కాదు. మొక్కజొన్న చొప్ప ఇంధనోత్పత్తి అనేక ఉద్యోగాలను, ఇతర ఆర్థిక ప్రయోజనాలను సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. డబ్ల్యూఆర్ఐ పరిశోధన ప్రకారం, సంవత్సరానికి 300 కోట్ల గ్యాలన్ల మొక్కజొన్న చొప్పతో వైమానిక ఇంధనం ఉత్పత్తిలో పెట్టుబడి పెట్టడం వల్ల 99 వేల నుంచి 2.14 లక్షల ఉద్యోగాలు సృష్టించవచ్చు. సంబంధిత ఆర్థిక కార్యకలా?ెలు వేలాది కోట్ల డాలర్ల పన్ను రాబడి అదనంగా చేకూరుతుందని అంచనా.

### ప్రాథమిక దశలో పరిశోధనలు

మొక్కజొన్న చొప్పను జెట్ ఇంధనంగా మార్చే సాంకేతికతలపై పరిశోధనలు ఇంకా ప్రాథమిక దశలో ఉన్నాయి. సాంప్రదాయ జెట్ ఇంధనాలతో ధరల పరంగా ఈ ప్రత్యామ్నాయ ఇంధనం ఇంతకుముందు వరకు ?ోటీపడలేక?ోవడం కూడా ఇందుకు ఓ కారణం. కానీ ఇరాన్‌పై యుద్ధం వంటి భౌగోళిక రాజకీయ సంఘర్షణల కారణంగా సాంప్రదాయ ఇంధన ధరలు భారీగా పెరగడంతో ఈ అంతరం తగ్గుతోంది. దీనివల్ల కొత్త రకాల విమానయాన ఇంధనోత్పత్తి రంగం పెట్టుబడిదారులకు, విమానయాన సంస్థలకు మరింత ఆకర్షణీయంగా మారుతోంది. పరిశోధన, అభివృద్ధికి విధానపరమైన మద్దతు, విస్తరణ ప్రోత్సాహకాలు లేకుండా మొక్కజొన్న చొప్పతో ఇంధనం ఉత్పత్తి సాంకేతికతల అభివృద్ధి యజ్ఞం నెరవేరదు. డబ్ల్యూఆర్ఐ పరిశోధన ప్రకారం, అన్ని సమస్యలకు ఒకే పరిష్కారంగా పనిచేసే సాంకేతికత అంటూ ఏదీ లేదు. దానికి బదులుగా, ఏ సాంకేతికతలకు అత్యధిక సామర్థ్యం ఉందో అర్థం చేసుకోవడానికి, విభిన్న రకాల సాంకేతికతల పరిశోధన, అభివృద్ధికి విధానాల మద్దతు ఇవ్వాలి. మొక్కజొన్న చొప్ప అమెరికాలో అత్యంత సవృద్ధిగా లభించే వ్యవసాయ వ్యర్థం. చొప్ప ఆధారిత విమానయాన ఇంధనోత్పత్తి పరిశ్రమ మన ఇంధన భద్రతకు దోహదపడటంతో పాటు, విమానయాన ఉద్గారాలను తగ్గించి, మొక్కజొన్న ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చెయ్యగలదని నిపుణులు భావిస్తున్నారు.



## జూన్ 7న బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

--ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీష్‌రావు హాజరుకానున్నారు

--పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి పిలుపు



పెద్దపల్లి , జూన్ 05: (లోకల్ గైడ్ )పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఈ నెల 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి మెయిన్ రోడ్‌లో ఉన్న తిరుమల గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అన్ని మండలాలు, పట్టణాల కార్యవర్గ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు, పార్టీ కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ:జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు

ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు ప్రజావాణి



గద్వాల:-జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు కీలక నిర్ణయం తీసుకున్నారు.జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి రోజు ( వర్కింగ్ డేస్ లో ) మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా ఎస్పీ స్వయంగా ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, న్యాయపరమైన సమస్యలు, ఫిర్యాదులు, వినతిపత్రాలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

## అగ్నికి ఆహుతైన టేకు వనం.. ప్రభుత్వ సాయానికి రైతు విజ్ఞప్తి



పెద్దపల్లి , జూన్ 5 :(లోకల్ గైడ్ ) పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 3.12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న టేకు వనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రైతు కొండి కొమరయ్యకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, కొమరయ్య 16 సంవత్సరాల క్రితం సుమారు రూ.40 లక్షల పెట్టుబడితో తన వ్యవసాయ భూమిలో 2,300 టేకు మొక్కలను నాటారు. ఎన్నో ఏళ్లుగా సంరక్షిస్తూ పెంచుకున్న ఈ టేకు వనం గురువారం రాత్రి అకస్మాత్తుగా చెలరేగిన మంటల కారణంగా పూర్తిగా కాలిపోయింది. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో సుమారు రూ.1 కోటి మేర ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. జీవితకాల శ్రమతో పెంచుకున్న టేకు వనం క్షణాల్లో బూడిద కావడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, తగిన పరిహారం అందించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతు కొండి కొమరయ్య ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక రైతులు, గ్రామస్తులు కూడా బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే.



నిర్మల్ : లోకల్ గైడ్ :భైంసా పట్టణంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా అర్బన్, భైంసా రూలర్ కు సంబంధించిన లబ్ధిదారులకు మొత్తం 185 చెక్కులను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు సమాజంలోని పేద తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కల నాటకం

అడవుల పరిరక్షణతోనే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణం

జిల్లావ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, బైక్ ర్యాలీ నిర్వహణ



పెద్దపల్లి, జూన్-05:(లోకల్ గైడ్ )పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ అత్యంత అవసరమని అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్దపల్లి జిల్లా రంగంపల్లి జిల్లా కోర్టు సముదాయంలో అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి, జూనియర్ సివిల్ జడ్జి ఎన్. మంజుల ఆధ్వర్యంలో మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల ప్రాధాన్యం, పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి కే.స్వప్న రాణి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు.అనంతరం భూపాలపల్లి జిల్లా అటవీ అధికారి, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్ అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రామగుండం ప్రాంతీయ కార్యాలయ సహాయ శాస్త్రవేత్త ఈ. కనక జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐడీఓసీ కార్యాలయం నుంచి ఖిలావనపర్తి గ్రామం వరకు అటవీ శాఖ సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మారం మండలంలోని ఖిలావనపర్తి రాంపల్లి రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లోని కాంపార్ట్‌మెంట్ నెం.479/1 వద్ద రెండు హెక్టార్ల అధిక సాంద్రత మిశ్రమ మొక్కల పెంపకం ప్రాంతంలో ప్రత్యేక మొక్కల నాటకం కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కోర్టు సముదాయంలో 30 మొక్కలు, ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో 10 మొక్కలు, ఖిలావనపర్తి ప్రాంతంలో 20 మొక్కలు నాటారు.ఈ కార్యక్రమాల్లో అటవీ శాఖ అధికారులు, టి. సతీష్ కుమార్, వినయ్ నాయక్, దేవదాస్, రమేష్ కొమురయ్య,రహమతుల్లా,ఖిలావనపర్తి సర్పంచ్ మోతే కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో వరి ధాన్యాన్ని గోదాములో నిల్వ చేస్తాం 100% కొనుగోలు కేంద్రాల నుండి తరలించేందుకు చర్యలు

అధికారులు లారీ యజమాన్యాలతో చర్చించి రైస్ మిల్లులో గోదాంలో నిల్వ

రైస్ మిల్లులు గోదాముల పరిశీలన

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 05 (లోకల్ గైడ్ తెలంగాణ)పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో గల రైస్ మిల్లు గోదాంలో నిల్వచేసిన వరి ధాన్యాన్ని స్థానిక నాయకులతో కలిసి గౌరవ తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూపెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు సెంటర్ లో ఉన్నవరి ధాన్యం 98% తరలించామని పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో లారీల జాప్యం హమాలీల



కొరత తో అక్కడక్కడ కొంతమేర మిగిలి ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు పెద్దపల్లి, సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు భారీ, తిరుపతి, శ్రీనివాస్, సతీష్ లతో మాట్లాడి పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్, రంజిత్ ఎస్ ఐ లు పోలీసులు, అధికారుల సహకారంతో పూర్తిస్థాయిలో తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హమాలీల కొరత లేకుండా మరి కొంతమంది హమాలీలా తో మాట్లాడామని పెద్ద కల్వల సంతు, నరేష్ లు రాత్రి సమయంలో కూడా వారి సహకారంతో పూర్తిస్థాయిలో రెండు మూడు రోజులలో ధాన్యాన్ని లిఫ్ట్ చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి లలో అక్కడక్కడ కొన్నిచోట్ల మిగిలిపోయిన ధాన్యాన్ని రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో లిఫ్ట్ చేస్తామని తెలిపారు. కేరళకు రుతుపవనాలు తాగాయని త్వరితగతిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో తరలిస్తామని అలాగే మక్కాలను సైతం నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో కొనుగోలు చేపట్టామని అవి ఎక్కడికి తరలించాలో అక్కడికి తరలించామని తెలిపారు. ఇప్పటివరకు రైతుల ఖాతాలలో నాలుగు కోట్ల రూపాయలు జమ అయ్యాయని మిగిలిన రూపాయలు సైతం త్వరలోనే రైతుల ఖాతాలో జమ కానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, పలు గ్రామాల సర్పంచ్ లు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ దినోత్సవం సందర్భంగా తంగేడు మొక్కల నాటకం -- పచ్చదన పరిరక్షణకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ పిలుపు



సిద్ధిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌హెచ్‌ఆర్‌సీ (జాతీయ మానవ హక్కుల కమిటీ) సిద్ధిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాగదేవత ఆలయం, కొండ మైసమ్మ ఆలయ ప్రాంగణాల్లో తెలంగాణ రాష్ట్ర పుష్ప చిహ్నమైన తంగేడు పూల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తంగేడు పువ్వు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ముఖ్యంగా బతుకమ్మ పండుగలో దీనికి విశిష్ట స్థానం ఉందని తెలిపారు. తంగేడు మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, జీవ వైవిధ్యాన్ని పెంపొందించటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరితమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. “ఒక్క మొక్క -- వెయ్యి ప్రాణాలకు ఆధారం”, “చెట్లను నాటుదాం -- ప్రకృతిని కాపాడుదాం” అనే సందేశాలతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.తెలంగాణ పచ్చదనాన్ని మరింత విస్తరింపజేయడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సిద్ధిపేట జిల్లా కమిటీ సభ్యులు సంపత్, కార్తీక్ రెడ్డి, రాములు, ప్రభురాజ్‌తో పాటు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీ- కల్లూరుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మితమవుతున్న



వేంసూరు :లోకల్ గైడ్ :శ్రీ- కల్లూరుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మితమవుతున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించిన సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , రాష్ట్ర కాంగ్రెస్ నాయుకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఇక్కడ అందుబాటులోకి రావడం ద్వారా వేంసూరు మండలంలోని ఆయిల్ ఫామ్ రైతులకు రవాణా భారం తగ్గి, మరింత సౌకర్యవంతంగా ఉంటుంది అని వారు తెలిపారు, అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌను లోని నిల్వలను పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి,వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయిల్ ఫామ్ మేనేజర్, ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ యువత బాధ్యత




ఖమ్మం :లోకల్ గైడ్ :మేర యువ భారత్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ సహకారంతో ఖమ్మం నగరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు . యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్ మరియు జిల్లా అధ్యక్షులు గోగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ యువత బాధ్యత అని చెట్లు పెంచడం వల్ల మానవాళికి ఆక్సిజన్ అందడం తో పాటు వర్షాలు కురవడం , కాలుష్య నిర్మూలన చెట్లు పెంపకం ద్వారానే సాధ్యమవుతుందని తెలియజేశారు . ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు సంవత్సరానికి కనీసం రెండు మొక్కలు నాటినట్లయితే రాబోయే రోజుల్లో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా రేడియేషన్ మరియు గ్లోబల్ వార్మింగ్ ను పూర్తిగా తగ్గించవచ్చని తెలియజేశారు . ఈ సందర్భంగా యువతతో పది మొక్కలను నాటించి అవగాహన ర్యాలీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు . అనంతరం యువత వేసిన పోస్టర్ పెయింటింగ్ లను పరిశీలించి బహుమతులు అందించారు . ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రచ్చ సతీష్ , మోహన్ , సారిక , ఉపేందర్ , కల్లేపు అఖిల మరియు విద్యార్థులు పాల్గొన్నారు .

## సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కొడెం లక్ష్మినర్సు మృతి

పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పిస్తున్న కమ్యూనిస్ట్ నాయకులు



ఖమ్మం జిల్లా,కారేపల్లి: లోకల్ గైడ్, జూన్ 5 : సింగరేణి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన సిపిఐ(ఎం)పార్టీ సీనియర్ నాయకులు కొడెం లక్ష్మీ నర్సు(60) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న లక్ష్మినర్సు పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. అమరజీవి ఏలూరు లక్ష్మీనారాయణ నాయకత్వంలో లక్ష్మినర్సు తన అన్న కోడెం అనంత రాములు తో కలిసి పూర్వ ఇల్లందు డివిజన్ లో సీపీఐ(ఎం)నిర్వహించే ప్రజా పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. మధిర మాజీ శాసనసభ్యులు అమరజీవి బోడెపుడి వెంకటేశ్వరరావు కారు డ్రైవర్ కామ్రేడ్ కొడెం లక్ష్మీనర్సు సుదీర్ఘకాలం పనిచేశారు. లక్ష్మీనర్సు భార్య పద్మ గతంలో మృతి చెందింది. గాంధీనగర్ లో లక్ష్మీనర్సు మృతదేహంపై నాయకులు సిపిఐ(ఎం)పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులైన కుమార్తెలు స్వాతి, రాణి లకు సానుభూతిని తెలియజేశారు. నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ(ఎం)మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్, సీనియర్ నాయకులు కరపటి వీరస్వామి, కేసగాని రామ్మూర్తి, ఈసం వెంకటేశ్వర్లు, కరపటి లక్ష్మయ్య, గోవర్ధనగిరి దశరథ్, జాగటి నాగేశ్వరరావు, కొడెం బోస్, బాయమ్మ, నీలిమ, గోపి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి..బండి రమేష్

-రూ.161 కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవనానికి జూన్ 8న భూమిపూజ



సైబరాబాద్, జూన్ 5 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): జూన్ 8వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు మియాపూర్‌లో రూ.161 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజతో పాటు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బండి రమేష్ శుక్రవారం జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి మియాపూర్‌లోని కార్యక్రమ స్థలంలో పరిశీలించారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్ల నర్సింహా రెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని బండి రమేష్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

